

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787


PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 28 జూలై 2021 సంపుటి : 02 సంచిక :361 పేజీలు : 4 వెల : రూ 3-00

## సముద్ర యానం బిల్లుకు
# పార్లమెంటు ఆమోదం



న్యూఢిల్లీ : సముద్ర యానం రంగంలో పెద్ద ఎత్తున సాంకేతిక అభివృద్ధి జరిగిందని, ఈ రంగాన్ని క్రమబద్ధీకరించవలసి ఉందని చెప్తూ పార్లమెంటు సముద్రయానానికి సహాయకారుల బిల్లు, 2021ని ఆమోదించింది. ఈ బిల్లు యావత్తు భారత దేశానికి వర్తిస్తుంది. వివిధ మారిటైమ్ జోన్లు, ప్రాదేశిక జలాలు, కాంటినెంటల్ షెల్ఫ్, ప్రత్యేక ఆర్థిక ప్రాంతాలకు వర్తిస్తుంది. దీంతో దీపస్తంభాలకు వర్తించే లైట్‌హౌస్ యాక్ట్, 1927 రద్దవుతుంది. సముద్ర ప్రయాణాలకు సహాయకారుల బిల్లు (మెరైన్ ఎయిడ్స్ టు నావిగేషన్ బిల్లు) సముద్ర యానానికి సహాయకారిని నిర్వచించింది. నౌకలకు వెలుపల ఉంటూ, నౌకల ట్రాఫిక్, నిర్దిష్ట నౌకల సముద్రయానం భద్రత, సమర్థత పెంచడానికి రూపొందించి, నిర్వహించే పరికరం, వ్యవస్థ లేదా సేవను సముద్రయానానికి సహాయకారి (మెరైన్ ఎయిడ్)గా నిర్వచించింది. నౌక అర్థ పరిధిలోకి ఓడ, పడవ, సెయిలింగ్ వెజల్, చేపల పడవ, సబ్‌మెర్సిబుల్, సెమీ సబ్‌మెర్సిబుల్ హైడ్రోఫోయిల్స్ వంటివి వస్తాయని తెలిపింది. సముద్రయాన సహాయకారులకు సంబంధించి ప్రభుత్వానికి సలహాలు ఇచ్చేందుకు డైరెక్టర్ జనరల్‌ను నియమించేందుకు ఈ బిల్లు అవకాశం కల్పించింది. అదేవిధంగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్స్, జిల్లాలకు డైరెక్టర్లను నియమించేందుకు కూడా అవకాశం ఇచ్చింది. బిల్లు వల్ల ప్రభావితులయ్యేవారితో లేదా ఈ విషయంలో స్పెషల్ నాలెడ్జ్ ఉన్నవారితో కేంద్ర సలహా సంఘం (సీఏసీ)ని ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించింది. సముద్రయానానికి సహాయకారుల ఏర్పాటు, ఇటువంటి సహాయకారులను అదనంగా ఏర్పాటు చేయడం, మార్చడం లేదా తొలగించడం వంటి అంశాలపై ఈ సంఘాన్ని ప్రభుత్వం సంప్రదించవచ్చునని తెలిపింది. సముద్రయాన సహాయకారులను ఉద్దేశపూర్వకంగా అడ్డుకునేవారికి రూ.1 లక్ష వరకు జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష లేదా ఈ రెండు శిక్షలు విధించవచ్చునని పేర్కొంది.

# అధికారుల తీరుపై సీఎం వైఎస్ జగన్ సీరియస్


### ఫెర్మామెన్స్ బాగా లేనివారికి మెమో జారీచేయాలని ఆదేశం



అమరావతి: విభారె) నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కొంతమంది అధికారుల తీరుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెర్మామెన్స్ బాగా లేనివారికి మెమో జారీచేయాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంపై సీఎం.. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారానికి నాలుగు సార్లు గ్రామ, వార్డు సచివాలయాలు సందర్శించాలని చెప్పాం, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకుంటే సమస్యలెలా తెలుస్తాయని సీఎం ప్రశ్నించారుతప్పులు జరిగితే వాటిని సరిచేసే అవకాశం ఉంటుందని, కలెక్టర్లు, జేసీల స్థాయిలో పర్యవేక్షణ బాగుందన్నారు. మిగిలిన అధికారులు కూడా సమర్ధవంతంగా పనిచేయాలన్నారు. 100 శాతం గ్రామ, వార్డు సచివాలయాల్లో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పేదల గురించి ఆలోచించి మానవత్వం చూపించాలని సీఎం జగన్ అన్నారు. "డీబీటీ పథకాల్లో సోషల్ ఆడిట్ కోసం జాబితాను ప్రదర్శిస్తున్నారా? లేదా? చూడాలి. బియ్యం కార్డు, పెన్షన్ కార్డు, ఇళ్ల పట్టాలు, ఆరోగ్యశ్రీ పథకాలు అత్యంత ముఖ్యమైనవి. నిర్దేశించుకున్న గడువులోగా అర్హులకు అందేలా చూడాలి. వీటిని స్వయంగా పరిశీలించాలి, పర్యవేక్షణ, సమీక్ష చేయాలి. ఏమైనా లోపాలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలి. గ్రామ, వార్డు సచివాలయాలను అధికారులు తరచూ తనిఖీ చేయాలి. ఆగస్టు 10న నేతన్న నేస్తం, ఆగస్టు 16న విద్యాకానుక అందజేస్తాం. రూ.20 వేల లోపు డిపాజిట్ చేసిన అగ్రిగోల్డ్ బాధితులకు ఆగస్టు 24న నగదు జమ చేస్తాం. ఎమ్ఎస్ఎమ్ఈలు, స్పిన్నింగ్‌మిల్స్‌కు ఆగస్టు 27న ఇన్సెంటివ్‌లు ఇస్తామని, ఈ మేరకు కలెక్టర్లు సన్నద్ధంగా సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.

# అప్పుల కుప్పగా ఏపీ

అమరావతి: అప్పుల కుప్పగా ఆంధ్రప్రదేశ్ మారిందిని పార్లమెంట్‌లో కేంద్రం స్పష్టం చేసింది. ఆదాయానికి మించి అప్పులు చేయడంలో ఏపీ అగ్రభాగాన ఉందని కేంద్రం పేర్కొంది. రాజ్యసభలో టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా పార్లమెంటు సాక్షిగా ఏపీకి కేంద్ర ఆర్థికశాఖ అక్షింతలు వేసింది. 2020-21 సంవత్సరానికి రు.54,369.18 కోట్ల ఆర్థిక లోటు ఉందని రాష్ట్ర ప్రభుత్వమే ఒప్పుకుందని కేంద్రం తెలియజేసింది. 15వ ఆర్థిక సంఘం అనుమతి మేరకు 2020-21 ఆర్థిక సంవత్సరానికి రూ. 30,305 కోట్ల అప్పునకు అనుమతి కోరిందని కేంద్రం పేర్కొంది. కొవిడ్ కారణంగా మరో రూ.19,192 కోట్ల అప్పునకు అనుమతిచ్చినట్లు కేంద్ర ఆర్థికశాఖ తెలిపింది. 2020-21 ఆర్థిక సంవత్సరానికి రూ. 49,497 కోట్ల అప్పులు తెచ్చుకునేందుకు అనుమతులు ఇచ్చామని పేర్కొంది. పరిమితికి మించి ఏపీ రూ.4,872 కోట్ల అప్పు చేసినట్లు కేంద్రం వెల్లడించింది.



# కోవిడ్‌పై నిరంతరం అప్రమత్తంగా ఉండాలి: సీఎం జగన్

### రాష్ట్రంలో కోవిడ్‌ను బాగా అరికట్టగలిగాం
### స్పందన కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్



అమరావతి విభారె) : రాష్ట్రంలో కోవిడ్‌ను బాగా అరికట్టగలిగామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. స్పందన కార్యక్రమంపై ఆయన మంగళవారం కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, కోవిడ్‌పై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. కరోనా అనుమానంతో ఎవరైనా వస్తే ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయాలన్నారు.కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ఈ-క్రాప్‌పై దృష్టి ఉంచాలని సీఎం సూచించారు. ఈ-క్రాప్ జరగని రైతు ఉండకూడదని, డాక్యుమెంట్ల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకూడదన్నారు. కచ్చితంగా అడ్వైజరి సమావేశాలు జరగాలని సీఎం స్పష్టం చేశారు. ఆర్‌బీకేలో రైతుల నుంచి వచ్చే సలహాలు తీసుకోవాలన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువులు మార్కెట్‌లోకి రాకుండా చూడాలని అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. జగనన్న పచ్చతోరణం కింద ఆగస్టు 15 నుంచి 31 వరకు కోటి మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, మొక్కలు నాటడమే కాదు.. సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ సూచించారు.

# ఏపీ తీర ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

### రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ
### మెరైన్ ఎయిడ్స్ అండ్ నావిగేషన్ బిల్లుపై రాజ్యసభలో చర్చ



ఢిల్లీ: మెరైన్ ఎయిడ్స్ అండ్ నావిగేషన్ బిల్లుపై రాజ్యసభలో మంగళవారం చర్చ జరిగింది. వైఎస్సార్‌సీపీ తరఫున చర్చలో ఎంపీ మోపిదేవి వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాయపట్నం పోర్టును కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాలని కోరారు. విభజన చట్టం మేరకు ఈ పోర్టు అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో ఉన్న ఆరు లైట్ హౌస్ లను పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేయాలన్నారు. ఏపీ తీర ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎంపీ మోపిదేవి వెంకటరమణ విజ్ఞప్తి చేశారు.

# ఏపీలో 2 మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు: మేకపాటి

అమరావతి: ఏపీలో 2 మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి తెలిపారు. త్వరలో ప్రత్యేక లాజిస్టిక్ పాలసీ-2021ను అమలులోకి తేనున్నట్లు వెల్లడించారు. లాజిస్టిక్ పాలసీ -2021 పై ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తరహాలో ఈజ్ ఆఫ్ లాజిస్టిక్స్ ఉంటుందన్నారు. మౌలిక సదుపాయలకు పెద్దపీట వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మంత్రి మేకపాటి అధ్యక్షతన పరిశ్రమల శాఖపై సమీక్ష నిర్వహించారు.



# కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌తో వైఎస్సార్‌సీపీ ఎంపీల భేటీ

### ఏపీకి రావాల్సిన రూ.6,750 కోట్ల బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి



ఢిల్లీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రా(ష్టానికి రావలసిన 6,750 కోట్ల రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీలు మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నాయకులు వి.విజయసాయి రెడ్డి, పార్టీ లోక్ సభాపక్ష నాయకులు మిథున్ రెడ్డి సారథ్యంలో ఎంపీల బృందం మంత్రితో సమావేశమయ్యారు. ఉపాధి పనుల బకాయిల విడుదలతో పాటు ఈ పథకం కింద పని దినాలను 100 నుంచి 150కి పెంచాలని కోరారు. ఈ మేరకు ఎంపీలందరూ సంతకాలు చేసిన వినతి పత్రాన్ని మంత్రికి అందచేశారు.వైఎస్సార్‌సీపీ ఎంపీల బృందం మంత్రితో జరిపిన భేటీలో విజయసాయి రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 18.4 కోట్ల పని దినాలను కల్పించి దేశంలోనే అత్యధిక పని దినాలు కల్పించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రికార్డు నెలకొల్పిందని తెలిపారు. కేవలం మూడు నెలల వ్యవధిలోనే 16.7 కోట్ల పని దినాలను కల్పించి కూలీల బడ్జెట్‌లో 83.5 శాతం వినియోగించుకుంది.ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి అత్యధిక ఉపాధి కల్పించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. 2006లో దేశంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు ప్రారంభమైన తర్వాత ఇంత పెద్ద ఎత్తున ఈ పథకం కింద ఉపాధి కల్పించింది ఆంధ్రప్రదేశ్ మాత్రమే. కోవిడ్ మహమ్మారి సృష్టించిన విలయం నేపథ్యంలో ఉపాధి పనులకు ఏర్పడిన డిమాండ్ దృష్ట్యా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పేదలకు కనీసం ఒక కోటి పని దినాలు కల్పించాలని గత ఏప్రిల్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్యాన్ని తొమ్మిది జిల్లాల్లో విజయవంతగా చేరుకోగలిగినట్లు చెప్పారు.గ్రామీణ ఉపాధి పథకం అమలులో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఈ పథకాన్ని మరింత కట్టుదిట్టంగా అమలు చేయడంలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరిం చడానికి చొరవ తీసుకోవలసిందిగా విజయసాయి రెడ్డి మంత్రిని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ ఖర్చును 20 లక్షల రూపాయలకు పెంచాలి. దీని వలన ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఉపయుక్తంగా ఉండే టాయిలెట్లు, పరిశుభ్రమైన తాగు నీరు, క్రీడా సౌకర్యాల కల్పిన కోసం ఉపాధి పథకం కింద ఇచ్చే మొత్తాన్ని 15 లక్షలకు పెంచాలి. మిగిలిన 5 లక్షల రూపాయలు ఐసీడీఎస్ వాటా కింద చెల్లించడం జరుగుతుందని తెలిపారు.

# పార్టీ పరిశీలకుడిగా బెంగళూరుకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్: విభారె) కర్ణాటక కొత్త సీఎం ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. కొత్త సీఎం ఎంపిక కోసం పార్టీ పరిశీలకుడిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాసేపట్లో బెంగళూరు వెళ్లనున్నారు. ఇవాళ సాయంత్రం సీఎల్పీ మీటింగ్ తర్వాత కొత్త సీఎం పేరును ప్రకటించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే, కర్ణాటక సీఎం పదవికి యడియూరప్ప సోమవారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తదుపరి సీఎంగా పలువురు ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, మాజీ మంత్రి సదానంద గౌడ పేర్లు వినిపిస్తున్నాయి. సీఎం పోస్టు తమకే ఇవ్వాలని బ్రాహ్మణ, పంచమశాలి లింగాయత్, దళిత సామాజిక వర్గాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి.



# ఏపీ ఉన్నత విద్యా మండలి కీలక నిర్ణయం

### ఈ ఏడాది ఎంసెట్‌లో ఇంటర్ వెయిటేజ్ తొలగింపు

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఎంసెట్‌లో ఇంటర్ వెయిటేజ్ తొలగించింది. ప్రతీ ఏటా ఇంటర్ మార్కులు ఆధారంగా ఎంసెట్‌లో 25శాతం వెయిటేజ్ ఇస్తున్న ఉన్నత విద్యామండలి.. కోవిడ్ కారణంగా ఇంటర్ పరీక్షలు రద్దు నేపథ్యంలో ఈ ఏడాది వెయిటేజ్ తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వంద శాతం ఎంసెట్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగానే.. అగ్రికల్చర్, ఇంజినీరింగ్ విభాగాల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఉన్నత విద్యామండలి వెల్లడించింది.

# ఏపీలో కొత్తగా 1,540 కరోనా కేసులు, 19 మరణాలు

అమరావతి విభారె) : ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు తగ్గుతున్నా మరణాలు పెరుగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో కొత్తగా 1,540 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 2,304 మంది బాధితులు చికిత్సకు కోలుకున్నారు. 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏపీలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 19,57,932కు పెరిగింది. ఇవాళ్టివరకు 19,23,675 మంది కోలుకున్నారు. మరో 20,965 యాక్టివ్ కేసులున్నాయి. మొత్తం మరణాలు 13,292కు చేరాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ 61,298 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేసినట్లు ఆ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది.



# సంపాదకీయం

బుధవారం 28 జూలై 2021

## పార్టీని చక్కదిద్దేపనిలో అక్కా తమ్ముళ్లు

గడచిన రెండు సంవత్సరాలుగా దాదాపు అనాథగా వదిలేసిన కాంగ్రెసును చక్కదిద్దే పనిని అగ్రనాయకత్వం చేపట్టింది. సోనియా అనారోగ్యం, రాహుల్ విముఖత, ప్రియాంక నిరాసక్తత ఇప్పటి వరకూ పార్టీని వేధించాయి. కాంగ్రెసు పార్టీని కొంతకాలంగా పట్టించుకునేవారు కరవు అయ్యారు. చాలావరకూ వ్యవహారాలు రాష్ట్ర నాయకత్వాల ఇష్టారాజ్యంగా కొనసాగాయి. ఢిల్లీలో పార్టీని పట్టుకుని వేలాడుతున్న వృద్ధ నాయకులు శాసిస్తూ వచ్చారు. అయితే తాజా పరిణామాలను బేరీజు వేస్తే రాహుల్, ప్రియాంకలు టీమ్ అప్ అయ్యారు. స్పీడు పెంచారు. పార్టీని క్లీన్ అప్ చేసి, ధిక్కరించే వారిపై వేటు వేసేందుకు సిద్ధమయ్యారు. దాంతో ఒక్కొక్కరుగా పెద్ద నాయకులు దారికి వస్తున్నారు. ఇంతవరకూ సోనియా గాంధీ తమకు అండగా నిలుస్తుందనుకుంటున్న నాయకులు వాస్తవాన్ని గ్రహిస్తున్నారు. రాహుల్ , ప్రియాంకల నిర్ణయాలను గౌరవిస్తూ తమ అసమ్మతిని మనసులో దాచుకుంటున్నారు. పార్టీకి ఇదొక మంచి పరిణామంగానే కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. పార్టీ వారసుడు, భవిష్యత్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇటీవలి కాలంలో మళ్లీ స్పీడ్ పెంచారు. పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. 2019 ఓటమి తర్వాత తీవ్ర నిరాశానిస్పృహల్లో కూరుకుపోయి, తనంత తానుగా పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అప్పట్నుంచి అడపాదడపా ట్విట్టర్ వేదికగా, లేదంటే ఆన్ లైన్ లో విమర్శలు కురిపిస్తున్నారు. ప్రతిపక్షనేత స్థాయిలో ఫోర్స్ కనిపించడం లేదు. ఆయా విమర్శలు, ఆరోపణలను బీజేపీ చాలా తేలికగా తీసుకుంటోంది. గతంలో రాహుల్ విమర్శలకు ప్రధాని, అమిత్ షా స్థాయిలో ప్రతిస్పందన కనిపించేది. కానీ గడచిన ఏడాది కాలంగా వారు పట్టించుకోవడం మానేశారు. పార్టీలోనూ ఆయనపట్ల నిరాసక్తత మొదలైంది. ప్రియాంక రావాలని చాలామంది రాష్ట్రస్థాయి నాయకులు ఆశించారు. అధ్యక్ష స్థానంలో బాధ్యతలు స్వీకరించేందుకు ఆమె సిద్ధం కాలేదు. సోనియా సైతం రాహుల్ కే పగ్గాలు ఇవ్వాలని భావించడం వల్ల కాంగ్రెసు నాయకుల డిమాండ్ ఫలించలేదు. మొత్తమ్మీద సోనియా, ప్రియాంక కలిసి రాహుల్ ను కన్విన్స్ చేసినట్లుగానే కనిపిస్తోంది. పార్టీ అంతర్గత విషయాలు, రాష్ట్రాల నాయకత్వంపై తాజాగా ఆయన సమీక్షలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెసు వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెసు పార్టీకి వదిలించుకోలేని బ్యాగేజీ వృద్ధ నాయకులు. వారికున్న అనుభవంతో సలహాలు, సూచనలకు పరిమితమైతే ఫర్వాలేదు. కానీ పదవులు పట్టుకుని వేలాడుతున్నారు. ఉన్న అరకొర పదవులూ తమకే కావాలంటున్నారు. అధికారంలో ఉన్న చోట్ల యువ నాయకులను ఎదగకుండా చేస్తున్నారు. లేని రాష్ట్రాల్లోనూ పార్టీ పదవులు వీడటం లేదు. ఈ పరిస్థితికి చెక్ పెట్టాలని సోనియా, రాహుల్ , ప్రియాంకలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. తెలంగాణ విషయంలో తీసుకున్న డేరింగ్ స్టెప్ అందుకొక ఉదాహరణ. విభజన తర్వాత అధికారాన్ని పువ్వుల్లో పెట్టి తెచ్చి ఇస్తామని గప్పాలు కొట్టిన నాయకులు కనీసం సొంత నియోజకవర్గాల్లో నెగ్గలేకపోతున్నారు. పార్టీ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. ఈ నేపథ్యంలోనే పార్టీకి కొత్తవాడైనప్పటికీ రేవంత్ కు అధ్యక్ష స్థానం అప్పగించేశారు. తిరుగుబాటు చేస్తామంటూ పెద్ద నాయకులు హెచ్చరించినా ఖాతరు చేయలేదు. అసమ్మతి , ఆందోళన చేస్తే వేటు వేస్తామంటూ హెచ్చరించారు. పరిస్థితులు వాటంతటవే సద్దుమణిగిపోయాయి. అలాగే పంజాబ్ లో ముఖ్యమంత్రి అమరీందర్ బలమైన నాయకుడు. నవజోత్ సింగ్ సిద్దూ యువతలో ఆదరణ ఉన్న నేత. 80 వ పడిలో ఉన్న అమరీందర్ కు సిద్దూ అంటే పడదు. దాంతో ఆయనను పార్టీ నుంచి వెళ్లిపోయే పరిస్తితులు కల్పించారు. రాహుల్, ప్రియాంకలు జోక్యం చేసుకుని పీసీసీ పీఠం పై సిద్దూని కూర్చోబెట్టారు. ముఖ్యమంత్రి దిగిరాకతప్పలేదు. రాజస్థాన్ , కర్ణాటక, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతాల్లోనూ నెలకొని ఉన్న సమస్యలపై దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెసుకు ఒక బలహీనత వెంటాడుతోంది. సొంతంగా కేంద్రంలో అధికారంలోకి రావడం అసాధ్యం. ప్రాంతీయపార్టీలపై ఆధారపడాల్సిందే. అదే విధంగా ప్రాంతీయ పార్టీలకూ, వామపక్షాలకు కూడా బలహీనత ఉంది. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే తమ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలకు కష్టాలు తప్పవు. వాటిని రాజకీయంగా ఆక్రమించేందుకు మోడీ, షాల ద్వయం చేయాల్సినదంతా చేస్తారు. ప్రాంతీయ నాయకులు అవినీతి, బంధుప్రీతి కారణంగా అనేక రకాల కేసులు ఎదుర్కొంటున్నారు. తాము సురక్షితంగా బయటపడాలంటే కాంగ్రెసు వంటి మధ్యేవాద పార్టీ ఉండాలని వారు బలంగా కోరుకుంటున్నారు. కాంగ్రెసు లేకుండా సొంతంగా ప్రాంతీయ పార్టీలు కూటమి కట్టే అవకాశం, అధికారం లోకి వచ్చే చాన్సులు లేవు. అందువల్లనే హస్తం పార్టీతో వారందరికీ అవసరం ఏర్పడింది. దాంతో కాంగ్రెసు నాయకత్వానిదే పైచేయిగా మారింది. ముందుగా ఫ్రంట్ ల తంటాలను పక్కనపెట్టి ఇంటిని చక్కదిద్దుకొంటోంది. అవసరం ప్రాంతీయ నేతలకు ఎక్కువ ఉంది . వారే వచ్చి తమతో చేయి కలుపుతారనే దీమా కాంగ్రెసులో వ్యక్తమవుతోంది.

# వర్షాకాలం...రోగాల భయం



ఒంగోలు, జూలై 27, (న్యూస్ పల్స్)వర్షాకాలం.. వ్యాధుల వ్యాప్తికి అనువైనది. ఎక్కడికక్కడ వర్షం నీరు, మురుగు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెందుతాయి. జనంపై దాడి చేస్తాయి. వ్యాధుల వ్యాప్తికి కారణం అవుతాయి. దోమల నివారణలో ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖలు ఏమాత్రం అలక్ష్యం చేసినా అతిసారా, డయేరియా, చికున్ గున్యా, విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. పారిశుధ్యం మెరుగుపరచని కారణంగా గతేడాది జిల్లాలో 1.10 లక్షల మంది విషజ్వరాల బారిన పడ్డారు. మొత్తం 71 మందికి పైగా మరణించారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులు సోకుతాయి. ప్లాస్మోడియం, ఫాల్లిఫారం అనే పరాన్న జీవి కలిగి ఉన్న ఆడ ఎనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వస్తుంది. చలితో కూడిన జ్వరం దీని లక్షణం. సకాలంలో స్పందించి వైద్య సేవలు పొందకపోతే మరణించే అవకాశాలూ లేకపోలేదు. ఈ వ్యాధి కూడా నీటి నిల్వలో పెరిగే ఈజిప్ట్, టైగర్ దోమల వల్ల వస్తుంది. తీవ్రమైన జ్వరాలు, కీళ్లనొప్పులు, ఒళ్లు నొప్పులు వస్తాయి. మందులు వాడితే తగ్గినట్టుండి మళ్లీ వస్తుంది. వైద్యుని పర్యవేక్షణలో చికిత్స పొందాలి. మంచినీరు, మురుగు నీటిలో పెరిగిన ఏడిస్ ఈజిప్ట్ అనే దోమ లేదా టైగర్ దోమ కుట్టడం వల్ల డెంగీ సోకుతుంది. డెంగీ హేమరేజస్ ఫీవర్, డెంగీ షాక్ సిండ్రోమ్‌కు గురైతే మరణాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. ఈ వ్యాధి సోకితే తీవ్రమైన జ్వరం, శరీరం ఎర్రగా కందిపోయి దద్దుర్లు రావడం, కళ్లు కదిలించలేక పోవడం, ఒళ్లు, కండరాల నొప్పులు, సాధారణ వాంతులు, రక్తం వాంతులు అవుతాయి. రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోతుంది. వ్యాధిగ్రస్తుడు వైద్యుల పర్యవేక్షణలో ఉండాల్సి వస్తుంది. వ్యాధి నయం అయ్యే వరకు మందులు వాడాలి. క్యూలెక్స్ దోమ కుట్టడం వల్ల వస్తుంది. ఈ వ్యాధి చిన్నపిల్లలకు ఎక్కువగా సంక్రమిస్తుంది. ఈ వ్యాధి వల్ల కళ్లు తిరగడం, రోగి అపస్మారక స్థితిలోకి వెళ్లడం జరుగుతుంది. కదల్లేని నిస్సహాయ స్థితికి చేరుకుంటారు. పందులకు కుట్టిన వ్యాధికారక వైరస్ దోమలు మనుషులకు కుట్టడం వల్ల వ్యాధి సంక్రమిస్తుంది. పరిశుభ్రమైన వాతావరణం కలిగి ఉండాలి. మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. పరిసరాల్లో చెత్తాచెదారం, పేడదిబ్బలు దూరంగా వేయాలి. కొబ్బరి బొండాలు, పాత టైర్లు, వినియోగించని మట్టి పాత్రలు, పూల కుండీలు, దోమలు అభివృద్ధి చెందే పనికిరాని పరికరాలు ఇళ్లకు దూరంగా ఉంచుకోవాలి. ఇంట్లో ఫ్రిజ్, కూలర్లు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి వస్తువులను ఎండబెట్టడం ద్వారా దోమలను నివారించుకోవచ్చు. దోమలు నివాసాల్లోకి రాకుండా కిటికీలు, తలుపులు సాయంత్రం మూసివేయాలి. దోమల నిర్మూలనకు కాయిల్స్ వాడాలి.

# చేపల చెరువుల్లో రొయ్యలు సాగు



ఏలూరు, జూలై 27,(న్యూస్ పల్స్)చేపల చెరువులకు అనుమతులు తీసుకుని ఆపేరుతో అనధికారికంగా రొయ్యల సాగు చేస్తున్నా అధికారులకు పట్టడం లేదు. ఈ రొయ్యల సాగుతో పంట భూములు కలుషితమై చౌడుబారుతున్నాయి. రొయ్యల చెరువుల నుంచి విడుదలయ్యే కలుషిత నీటితో భూగర్భ జలాలు కలుషితమై పంట భూములతో పాటు గట్ల వెంబడి ఉండే కొబ్బరి చెట్లు, తాడిచెట్లు సైతం మోడుబారిపోతున్నాయి. చెరువుల తవ్వకాలప్పుడు పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, ఫిషరీస్ డిపార్టుమెంట్ల అధికారులు మామూళ్ల మత్తులో కూరుకుపోవడంతో చెర్వుల యజమానులు ఆడింది ఆటగా పాడింది పాటగా సాగుతోంది. జిల్లాలో ఈ విధంగా అనధికారకంగా రొయ్యల సాగు సుమారు 2 వేల హెక్టార్లలో సాగుతున్నట్టు అంచనా. ఒక్క పెరవలి మండలంలోనే కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం, ఉసులమర్రు, తీపర్రు గ్రామాల్లో చేపల చెపల చెర్వుల తవ్వకాలకు 950 ఎకరాలకు అనుమతులు ఇచ్చారు. వీటిలో కేవలం 150 ఎకరాల్లో చేపల సాగు జరుగుతుండగా మిగిలిన 800 ఎకరాల్లో రొయ్యల సాగుచేస్తున్నారు. ఇప్పటికే కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ఇదేవిధంగా కొనసాగితే భవిష్యత్తులో స్వచ్ఛమైన తాగునీరు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. చేపల చెరువుల యజమానులు వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. దీనికి అధికారులు కూడా వంత పాడుతున్నారు. చేపల చెరువులు, పంటభూమల వద్ద బోరు వేయాలంటే సబంధిత శాఖ అనుమతి తప్పనిసరి. కానీ పెరవలి మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండానే బోర్లు వేశారు. అయినా ఎలాంటి చర్యలూ లేవు. ఏ చెర్వు యజమాని అనుమతులు తీసుకోకుండా బోర్లు వేశారు. గతంలో ఆప్రాంతంలో బోరు ఉంటే మరో బోరుకు అనుమతి ఇవ్వకూడదు. మరో బోరు వేయాలంటే పాత బోరు పూర్తిగా పాడైయిందని నిర్ధారించిన తరువాత మాత్రమే కొత్తదానికి అనుమతి ఇవ్వాలి. ఒకబోరు వేసిన చోట నుంచి మరో బోరు వేయడానికి 250 మీటర్ల దూరం ఉండాలి. అప్పుడే కొత్తబోరుకి అనుమతి ఇవ్వాలి. కానీ ఇక్కడ ఒకే చెర్వు వద్ద మూడు నుంచినాలుగు బోర్లు వేసి భూగర్భ జలాలను దుర్వినియోగం చేస్తున్నారు. ఈగ్రామాల ఆయకట్టు ప్రకారం మొత్తం కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు గ్రామాల్లో కేవలం 350 బోర్లు వేయాల్సి ఉండగా ఇక్కడ మాత్రం 800 బోర్లు పైనే ఉన్నాయి. వాల్టా చట్టం ప్రకారం ఉప్ప నీటిని పైకి తీసుకురావాలంటే ప్రత్యేక అనుమతి ఈ శాఖ వద్ద తీసుకోవలసి ఉంది. అలా తీసుకున్న దాఖలాలు ఎక్కడా లేవు. అంతే కాకుండా పంటభూములు ఉన్న చోట ఈ బోర్లకు అనుమతి ఇవ్వకూడదు. కానీ ఈ నిబంధనలు ఏమీ పాటించకుండానే ఇష్టారాజ్యంగా బోర్లు వేసి రొయ్యల సాగు చేస్తున్నారు.

# వివాదాలకు కేరాఫ్ అడ్రస్ గా ప్రసన్న కుమార్

నెల్లూరు, జూలై 27, (న్యూస్ పల్స్) ఏ నాయకుడు అయినా.. ఒకసారి వివాదం అయితే వెంటనే సర్దుబాటు చేసుకుని మరోసారి వివాదాలకు దూరంగా ఉంటారు. కానీ, నిత్యం వివాదాలు.. వివరణలతో సాగుతుంటే.. ఎవరైనా ఏమనుకుంటారు ? పార్టీపై పైచేయి సాధించాలని భావిస్తున్నారనో.. లేక కీలక పదవులు అందిపుచ్చుకునేందుకు.. లేదా ఆయనకు అధిష్టానంపై ఇంకేదో అసంతృప్తి ఉన్నందునో ఇలా వ్యవహరిస్తున్నారనో అనుకుంటారు. ఇలాంటి నేతల వార్తలను ప్రత్యర్థి పార్టీలకు చెందిన మీడియా మరింత దూకుడుగా ప్రచారం చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. కానీ, ఇలా వివాదమై.. అలా వివరణలు ఇవ్వడంలోనే ఆ ఎమ్మెల్యే ఇప్పటికి రెండు సంవత్సరాలుగా వార్తల్లో నిలుస్తుండడం గమనార్హం. ఆయనే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి. నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి స్టయిలే వేరు. ఆయన ఆశించింది జరగకపోతే.. వెంటనే బరస్ట్ అవుతారనే పేరు కూడా ఉంది. గతంలో కాంగ్రెస్.. తర్వాత వైసీపీలోకి వచ్చిన నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి కోవూరు నుంచి గెలిచిన వెంటనే మంత్రి పదవిని ఆశించారని ఆయన అనుచరులు చెబుతుంటారు. జగన్ కోసం టీడీపీ నుంచి బయటకు వచ్చిన తొలి ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి. అయితే రెడ్డి సామాజిక వర్గం ఈక్వేషన్లు కుదరని నేపథ్యంలో కీలకమైన నాయకులకు కూడా పదవులు దక్కలేదు. ప్రసన్న ఈ జాబితాలో చాలా దూరంగా ఉన్నారు. ఇదిలావుంటే.. తన వర్గానికి కూడా పనులు చేయలేకపోతున్నాననే ఆవేదన ఆయనలో ఉన్న మాట నిజమే. నెల్లూరు జిల్లా వైసీపీలో ఉన్న గ్రూపు రాజకీయాల గురించి ఇక్కడ ప్రత్యేక ప్రస్తావన అవసరం లేదు. ఇదిలా ఉంటే కొన్ని నెలల కిందట నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలే చేశారు. మా ప్రభుత్వం వచ్చిమాకు చేసింది ఏంటి ? అని పేర్కొన్న వీడియో ప్రధాన మీడియాలో హల్‌చల్ చేసింది. దీంతో ఆయన వివరణ ఇచ్చుకునే పరిస్థితి వచ్చింది. ఈ ఒక్క ఘటనతో ఆయన ఇమేజ్‌కు పార్టీలో డ్యామేజీ జరిగిందని పరిశీలకులు చెబుతుంటారు. ఇక, తాజాగా కూడా ఆయన నోరు అదుపు చేసుకోలేక పోయారు. సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇళ్ల నిర్మాణంపై తీవ్ర వ్యాఖ్యలే చేశారు. ఈ ఇళ్లల్లో శోభనాలు కూడా చేసుకోలేం అంటూ నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వ్యంగ్యంగా మాట్లాడిన మాటలు జగన్, పార్టీ పరువు తీసేశాయి. ఇవి వైరల్ అయి..

కీలక సలహాదారు నుంచి ఫోన్లు వచ్చే సరికి ప్రసన్న టంగ్ మార్చేశారట. సీఎం వైఎస్ జగన్‌కు తనను దూరం చేయాలని ఓ వర్గం మీడియా సంస్థలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన మాటలను వక్రీకరించి పదేపదే ప్రసారం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. తన చివరి రక్తపు బొట్టు వరకు వైఎస్ జగన్‌తోనే రాజకీయ జీవితం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అయితే సరే! మరి అనని వ్యాఖ్యలను ఏ మీడియా అయినా ప్రసారం చేస్తే ఎవరైనా ఊరుకుంటారా ? ముందు అనేసి.. తర్వాత వక్రీకరించిందనే బదులు.. మనసులో ఉన్న మాటను బయటకు చెప్పానని.. అంటే.. అటు జగన్‌కు కూడా సంకేతాలు పంపినట్టు అవుతుందని అంటున్నారు పరిశీలకులు. ఏదేమైనా.. ఒక వివాదం.. రెండు వివరణలు ఇచ్చుకుంటోన్న నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి లోపల పార్టీ తీరుపై చాలా బడబాగ్నిని దాచుకుంటున్నారు.

# రఘురాముడి ట్రాప్ లో జగన్..

ఏలూరు, జూలై 27, (న్యూస్ పల్స్)హీరో ఒకరు ఎలా అవుతారు. బలవంతుడి మీద యుద్ధం చేసి విజయం సాధిస్తే హీరో అయిపోతారు. సరిగ్గా పన్నెండేళ్ళ క్రితం జగన్ అనే యువ ఎంపీ సోనియా గాంధీ అనే మేరునగాన్ని ఢీ కొట్టి ఉమ్మడి ఏపీలో హీరోగా మారిపోయాడు. ఇపుడు అదే ప్రాక్టీస్ ని రెబెల్ ఎంపీ రఘురామకృష్ణరాజు చేస్తున్నారు. నాడు సోనియా గాంధీ తన అహంకారంతో జగన్ కి బ్రహ్మాండమైన అవకాశం ఇస్తే నేడు జగన్ రఘురామకృష్ణరాజుకు కూడా అదే వరాన్ని ప్రసాదించారన్న మాట. తాజాగా లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ రఘురామకృష్ణరాజు అనర్హత పిటిషన్ మీద చర్య అంటే దానికి ఒక ప్రక్రియ ఉంటుందని, రెండు వైపులా వాదనలు వినాలని మీడియా ఎదుట ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. అంటే ఎంపీ అనర్హత అంటూ ఒక పిటిషన్ ఇచ్చేసి అర్జంటుగా వేటేసేయండి అంటే అసలు కుదిరే వ్యవహారం కాదని ఓం బిర్లా తేల్చి చెప్పేసారు అన్న మాట. సభలో నిరసన తెలిపే హక్కు ఎవరికైనా ఉందంటూ స్పీకర్ అనడం బట్టి చూస్తే వైసీపీ ఎంపీలు సభను స్టాల్ చేస్తామనడాన్ని లైట్ గానే తీసుకున్నారు అనిపిస్తుంది. జగన్ తో విభేదించిన మొదట్లో ఎపుడో ఒకపుడు ఒకటి రెండు మాటలు అంటూ ఉండే రఘురామకృష్ణరాజును ఇంతటి స్థాయికి తెచ్చిన ఘనత అచ్చంగా జగన్ దే అని చెప్పాలి. ఆయన్ని పట్టించుకుంటే దగ్గరకు తీయాలి. వదిలేస్తే పూర్తిగా మరచిపోవాలి. ఇక జగన్ చేతిలో ఉన్న ఆయుధం ఏంటి అంటే ఒక్క దెబ్బకు సస్పెండ్ చేయడం. ఆ పని చేస్తే రఘురామకృష్ణరాజు ఎంపీగా కొనసాగుతారు అన్న బాధతో స్పీకర్ మీదకు దాన్ని నెట్టారు. అక్కడ యాక్షన్ లేక రఘురామకృష్ణరాజు రియాక్షన్ చూసిన మీదట ఓడిందెవరో వైసీపీ పెద్దలకు ఈపాటికే అర్ధం కావాలిగా. ఏపీలో అసలైన ప్రతిపక్షం అంటే రఘురామకృష్ణరాజు అనే చెప్పాలేమో. ఆయన ఇమేజ్ అమాంతం అలా పెరిగిపోయింది. జగన్ కి ఈక్వల్ గా ఆయన ఎదిగిపోయారు. అత్యంత ప్రజాదరణ కలిగిన జగన్ ఎక్కడ, ఆయన టికెట్ ఇస్తే గెలిచిన రఘురామకృష్ణరాజు ఎక్కడ. కానీ తన పక్కనే రాజుకు చోటు అంటూ జగనే సీటు ఇచ్చారు. ఇక ఏపీ రాజకీయాల్లో రఘురాముడు పొలిటికల్ గా బాగా ఫోకస్ అవుతున్నారు.

# రోజా కు మంత్రి పదవి పై పందాలు

తిరుపతి, జులై 27, (న్యూస్ పల్స్)విధేయతకు జగన్ ఈసారి అవకాశమిస్తే ఖచ్చితంగా ఆర్కే రోజాకు కేబినెట్ లో చోటు దక్కాలి. లేకుంటే విధేయతకే జగన్ విలువ ఇవ్వనట్లవుతుంది. వైసీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా కు ఈసారి మంత్రి పదవి వస్తుందా? రాదా? అన్న దానిపై పార్టీలో విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఆర్కే రోజాకు ఇప్పటికే ఏపీఐఐసీ ఛైర్మన్ పదవి ఉండటంతో ఈసారి కూడా మంత్రిపదవి దక్కదని కొందరు చెబుతుండగా, ఖచ్చితంగా జగన్ కేబినెట్ లో తీసుకుంటారని కొందరు అంటున్నారు. ఆర్కే రోజా మంత్రి పదవి విషయంలో పెద్దయెత్తున బెట్టింగ్ లు కూడా ప్రారంభమయ్యాయి. ఆర్కే రోజా మాత్రం జగన్ తనకు న్యాయం చేస్తారన్న నమ్మకంతో ఉన్నారు. నిజంగానే రోజా వైసీపీకి విలువైన నేత. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తన వాయిస్ తో అధికార పార్టీని ఇరుకున పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి వైసీపీ క్యాడర్ లో జోష్ నింపగలిగారు. అధికార పార్టీతో గొడవ పడి ఏడాది పాటు సస్పెండ్ అయ్యారు. అటువంటి ఆర్కే రోజాను కాదని నిన్న గాక మొన్న పార్టీలో చేరిన వారికి మంత్రిపదవులను ఇస్తే జగన్ విశ్వనీయత మీద మరక పడే అవకాశముంది. ఆర్కే రోజా ను సామాజికవర్గ పరంగా దూరం పెట్టాల్సిన అవసరం లేదంటున్నారు. ఆమె సినీ నటిగా, రాజకీయ నేతగా కులాలు, మతాలకు అతీతంగా అందరూ అభిమానిస్తారు. అటువంటి సమయంలో రెడ్డి కులం ముద్ర వేసి ఆర్కే రోజాను మంత్రిపదవికి దూరం చేయవద్దన్న కామెంట్స్ కూడా సోషల్ మీడియాలో విన్పిస్తున్నాయి. ఇప్పటికే తన నియోజకవర్గంలో ఆర్కే రోజాపై సొంత పార్టీలోని ప్రత్యర్థులే కత్తులు దూస్తున్నారు. ఆమెకు వ్యతిరేకంగా కుట్రలు జరుగుతున్నాయి. అయినా ఆమె తనకు మంత్రి పదవి వస్తుందన్న ఆశతో ఓపికగా భరిస్తూ వస్తున్నారు. మంత్రి పదవి రాకపోతే ఆర్కే రోజా బరస్ట్ అవుతారన్నది వాస్తవం. అది పార్టీకే మంచిది కాదన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. అయితే జగన్ మాత్రం రోజా లాంటి విధేయత గల నేతలకు ఈసారి అవకాశం కల్పిస్తారన్న టాక్ మాత్రం పార్టీలో విన్పిస్తుంది. ఆర్కే రోజా మంత్రి పదవిపై పెద్దయెత్తున బెట్టింగ్ లు నడుస్తుండం విశేషం.

# రాచమల్లుకు పదవీ భయం

కడప, జూలై 27, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో తన మన ఉండవు. నెంబరు 2 స్థానాన్ని ఎవరూ అంగీకరించరు. తనతో సమానంగా ఎదిగే వారిని తొక్కేయడానికే చూస్తారు. భవిష్యత్ లో తనకు పోటీ అవుతారన్న అనుమానం కావచ్చు. భయం కూడా కావచ్చు. ఇప్పుడు వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఇదే పరిస్థి?తిని ఎదుర్కొంటున్నారు. రాచమల్లు శివప్రసాద్ రెడ్డి రెండు సార్లు ప్రొద్దుటూరు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వచ్చే ఎన్నికల్లో?నూ హ్యాట్రిక్ విజయం సాధించాలనుకుంటున్నారు. రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వైసీపీ అధినేత జగన్ కు నమ్మిన బంటు. జగన్ ను ఆరాధించే ఎమ్మెల్యేల్లో రాచమల్లు ఒకరు. వీర విధేయుడిగా పేరపొందిన రాచమల్లు శివప్రసాద్ రెడ్డిలో ఇప్పుడు భయం మొదలయింది. దీనికి కారణం ఎవరో కాదు. తాను అత్యంతగా నమ్మి, ఆరాధించే జగనే కారణం. తనను ప్రొద్దుటూరు రాజకీయాల నుంచి సైడ్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అనుమానం. ఇందుకు కారణాలు కూడా లేకపోలేదు. ఇటీవల గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవిని ప్రొద్దుటూరు కు చెందిన రమేష్ యాదవ్ కు జగన్ కేటాయించారు. బీసీ సామాజికవర్గానికి కేటాయింపుల్లో భాగంగా ఇచ్చారని అందరూ భావించారు. కానీ రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆలోచన వేరే విధంగా ఉంది. తనకు భవిష్యత్ లో చెక్ పెట్టడానికే రమేష్ యాదవ్ ను జగన్ ఎమ్మెల్సీని చేశారన్న అనుమానం ఆయనను పట్టి పీడిస్తుంది. దీనికి తోడు రమేష్ యాదవ్ ఎమ్మెల్సీ అయిన వెంటనే ఆయన సామాజికవర్గం నేతలు ఆయన పంచన చేరిపోయారు. ఇది రాచమల్లుకు మరింత అవమానంగా మారింది. అందుకే రమేష్ యాదవ్ ను రాజకీయంగా ఎదగనివ్వకుండా చేయాలని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వర్గీయులు నిత్యం ప్రయత్నిస్తున్నారు. ఆయన కార్యాలయంపై నిఘా ఉంచారు. ఆయనను కలుస్తున్న వ్యక్తులకు వార్నింగ్ లు కూడా వెళుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ కే వార్నింగ్ కాల్స్ వచ్చాయి. దీని వెనక ఎవరున్నారన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొత్తం మీద ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కి రాజకీయ బతుకు భయం పట్టుకుందన్నది

# అండ కోసం ఎదురుచూపులు

గుంటూరు, జూలై 27, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ ఇంతగా భయపడలేదు. ఆయన అధికారంలో లేకపోయినా ఎప్పుడూ పైచేయి తనదే ఉండాలనే మనస్తత్వం. 2004 నుంచి 2014 వరకూ అధికారానికి దూరంగా ఉన్నా విపక్షాలతో కలసి వీధిపోరాటాలు చేయగలిగారు. చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినా పెద్దగా భయపడలేదు. అప్పట్లో ఎందరో నేతలు పార్టీని వీడినా తన పని తాను చేసుకుపోయే చంద్రబాబు రెండేళ్ల నుంచి మాత్రం పార్టీ భవిష్యత్ పై భయపడుతున్నారు. నడి సముద్రంలో చిక్కుకుపోయిన వారికి ఏదో ఒక్క ఆసరా చిక్కినా ఒడ్డుకు చేరతారు. ఆ ఆసరా కోసం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. కానీ రెండేళ్ల నుంచి ఎటువైపు నుంచి ఆసరా దొరకడం లేదు. ఇందుకు కారణం మూడు వైపుల నుంచి తనకు ఇబ్బంది కలిగించడమే. చంద్రబాబుకు ఎవరో ఒకరు అండ ఉండి తీరాలి. ఇప్పుడు ఎటు వైపు చూసినా మద్దతు దొరకడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చంద్రబాబును దగ్గరకు రానివ్వడం లేదు. తన రాజ్యసభ సభ్యులను పంపినా కూడా వారు కరుణ చూపించడం లేదు. బీజేపీ అండ కొంచెమైనా ఉన్నా చెలరేగిపోయేవారు. వచ్చే ఎన్నికల్లోనూ తమను ఆర్థికంగా ఇబ్బందులు పెడతారన్న భయం బీజేపీతో చంద్రబాబుకు పట్టుకుంది. బీజేపీ సహకారం కోసం ఆయన వెయిట్ చేస్తున్నారు. మరోవైపు పొరుగు రాష్ట్రం ముఖ్యమంత్రి కేసీఆర్ సయితం చంద్రబాబుపై గురిపెట్టారు. నీటి సమస్యలతో జగన్ కు, కేసీఆర్ కు మధ్య విభేదాలు తలెత్తినా ఆయనతో సఖ్యతకు చంద్రబాబు ప్రయత్నించలేని పరిస్థితి. ఎందుకంటే ఓటుకు నోటు కేసుతో పాటు తన పార్టీని కేసీఆర్ పూర్తిగా నిర్వీర్యం చేసేశారు. టీడీఎల్పీని విలీనం చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని కూడా తమ గూటికి రప్పించుకున్నారు. చంద్రబాబుతో కయ్యమే తప్ప వియ్యం ఉండదన్నది కేసీఆర్ ఆలోచన. అందుకే ఇక్కడి నుంచి కూడా చంద్రబాబుకు సహకారం అందే అవకాశం లేదు. ఇక ఎటూ ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ రోజురోజుకూ స్ట్రాంగ్ అయిపోతుంది. పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టడం, ఆర్థిక వనరులు దెబ్బతీస్తుండటంతో నేతలు కూడా భయపడిపోతున్నారు. జగన్ ను ఎదుర్కొనేందుకు ఒంటరిపోరాటం చేయాల్సి వస్తుంది. తనకు సీపీఐ మినహా ఏ పక్షమూ కలసి వచ్చే అవకాశం లేదు. ఇలా చంద్రబాబు రాజకీయ జీవితంలో ఎన్నడూ లేని విషమ పరీక్షను ఎదుర్కొంటున్నారు. ఒంటరి పోరాటం చేస్తున్నారు. మోదీ, కేసీఆర్, జగన్ లు శత్రువులుగా మారారు. ఈ ముగ్గురి నుంచి చంద్రబాబుకు రాజకీయ ముప్పు పొంచి ఉందనే చెప్పాలి.

# తమిళ పాలిటిక్స్ ఎప్పటికో...

విజయవాడ, జూలై 27, (న్యూస్ పల్స్)జగన్ అంటే చంద్రబాబుకు పడదన్నది తెలిసిందే. ఇద్దరిదీ రాజకీయ వైరం దాటి వ్యక్తిగత స్థాయికి వచ్చేసింది. కనీసం ఎదురుపడి ముఖాముఖాలు చూసుకోరు. అసెంబ్లీ సమావేశాల్లో తప్ప ఇద్దరు జాయింట్ గా ఒకే ఫ్రేమ్ లో కనిపించిన ఘటనలు ఒక్కటి కూడా ఉండవు. పొరుగున ఉన్న తమిళనాడు కానీ నిన్నటిదాకా కలసి ఉన్న తెలంగాణాలోని ఐక్యత కానీ ఏపీలో మచ్చుకైనా కనిపించవు.ఏపీలో ఇపుడు అనేక సమస్యలు ఉన్నాయి. వాటిలో చాలావరకూ కేంద్రం సృష్టించినవే ఎక్కువ. లిస్ట్ అలా చదివితే అన్నీ కేంద్రమే చేయాలి కదా అనిపిస్తుంది. రాజధాని నుంచి మొదలుపెడితే పోలవరం, విభజన హామీలు, రెవిన్యూ లోటు భర్తీ. పొరుగు రాష్ట్రం తెలంగాణా నుంచి రావాల్సిన విద్యుతు బకాయిలు ఇప్పించడం. క్రిష్ణా జలాల విషయంలో న్యాయం చేయడం, ప్రత్యేక హోదా ఇలా కేంద్రం ఏపీ విషయంలో చాలా సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. కానీ కేంద్రానికి గట్టిగా నిలదీసేలా ఏపీ నుంచి ఉద్యమాలు లేవు అన్నది పచ్చి నిజం.ఇక ఉన్నవి చాలవు అన్నట్లుగా కొత్తగా విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యను కేంద్రం నెత్తిన పెడుతోంది. స్టీల్ ప్లాంట్ ని ప్రైవేట్ పరం చేస్తామని కూడా చెబుతోంది. దీని మీద కూడా ఏపీలోని రాజకీయం అంతా ఒక్క మాట మీదకు రావడం లేదు. అయితే మొత్తానికి అపర చాణక్యుడు చంద్రబాబు మాత్రం నోరు విప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో మొదట నిలబడి పోరాటం చేయాల్సింది జగనే అంటున్నారు. ఆయనే మన లీడర్ అని కూడా చెప్పేస్తున్నారు. జగన్ లీడ్ తీసుకుని ముందుకు కదిలితే వెనక తెలుగుదేశం కూడా వస్తుంది అంటూ ఆశ్చర్యకరమైన ప్రతిపాదనే చేశారు. అంటే జగన్ని ఇక్కడ రాజకీయంగా ఇరికించారు అనే చెప్పాలి. అదే సమయంలో జగన్ నాయకత్వం వహిస్తే తాను కూడా వెంట వచ్చేందుకు సిద్ధమని చంద్రబాబు చెప్పకనే చెప్పేశారు కూడాఅక్కడ ఉన్నది మోడీ, పైగా ఆయన నిర్ణయం తీసుకోవాలే కానీ వెనక్కి తగ్గేది లేదు అంటారు. అయితే చరిత్రలో ఒక్కసారి అయినా ఆంధ్రుల ఐక్యతను చాటి చెప్పడానికి బాబు జగన్ భుజం భుజం కలిపి ఢిల్లీ వారికి కొత్త సినిమా చూపిస్తే బాగుంటుంది అన్నది జనం మాట. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉంటేనే ఇవాళ జగన్ అయినా రేపు బాబు అయినా సాఫీగా రాజకీయం చేసేది. పైగా ఉత్తరాంధ్రాలోని మూడు జిల్లాల ప్రజలు ఆధారపడిన ఇంత పెద్ద ప్లాంట్ మరోటి తేవడం ఇక మీదట కష్టమే అన్నది కూడా అందరికీ తెలిసిందే. మరి ఇంతకంటే పెద్ద సమస్య లేదు కాబట్టి బాబు ఏ రకంగా అనుకుని ప్రతిపాదించినా కూడా జగన్ సై అనాలి, అఖిలపక్షానికి తాను నాయకత్వం వహించి ఏపీ జనాల మెప్పు పొందాలి అంటున్నారు. అపుడు ప్లాంట్ ని ఒకవేళ ప్రైవేట్ పరం చేసినా కూడా జగన్ కి ఆ నింద రాదు అంటున్నరు.

## పొంగి పొర్లుతున్న గోస్తనీ

ఏలూరు జూలై 27, (న్యూస్ పల్స్)గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రముఖ పుణ్యక్షేత్రలు నీట మునిగాయి.పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలోని పుణ్యక్షేత్రలుగా విరాజిల్లుతున్న నత్తా రామేశ్వరం లో శ్రీ పార్వతి సమేత రామేశ్వర స్వామి వారి ఆలయం , జుత్తిగ గ్రామంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయాల్లోకి కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురవడంతో ఆలయం ప్రక్కనే ఉన్న గోస్తనీ నది పొంగి ప్రవహిస్తున్న కారణంగా వరద నీరు ఆలయం లో కి ప్రవేశించి ఆలయం మొత్తం వరద నీటితో మునిగిందని , అలానే స్వామి వారికి పూజలు అభిషేకాలు నిలిపి వేయకుండా నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు రామలింగేశ్వర శర్మ తెలియజేసారు.

## తుంగభద్ర డ్యామ్ కు భారీ వరద

కర్నూలు జూలై 27, (న్యూస్ పల్స్)తుంగభద్ర డ్యామ్ కు భారీ వరద పొటెత్తింది. 33 గేట్లు ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడుదల చేసారు. ఇన్ ఫ్లో క్యూసెక్కులు, 1,36,022, ఔట్ ఫ్లో 1,30,913 క్యూసెక్కులు , పూర్తిస్థాయి నీటి మట్టం 100 టీఎంసీలు వుంది. ప్రస్తుతం నీటి మట్టం 95 టీఎంసీలు, నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేసారు.

## ఆలయమలే టార్గెట్?వరుస చోరీలు

పలమనేరు జూలై 27, (న్యూస్ పల్స్)పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలో దొంగలు రెచ్చిపోయారు. ఒకే రాత్రి ఒకే మార్గంలో గల మూడు దేవాలయాల్లో చోరీకి పాల్పడ్డారు. కీలపట్ల గ్రామం కోనేటిరాయస్వామి దేవాలయంలో, బొమన పల్లి నరసింహ స్వామి దేవాలయంలో, కొత్తపల్లి మారెమ్మ తల్లి దేవాలయంలో హుండీ సొమ్ము చోరీ చేసారు. కీలపట్ల గ్రామం మధ్యలో గల తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోనేటిరాయ స్వామి దేవాలయంలో కుడా చోరీ జరిగింది. వరుస దొంగతనాలతో గ్రామప్రజలు గ్భ్రాంతికి గురైయారు.

## ప్రొద్దుటూరు లో టెన్షన్..టెన్షన్

ప్రొద్దుటూరు జూలై 27, (న్యూస్ పల్స్)కడప జిల్లా ప్రొద్దుటూరులో టిప్పుసుల్తాన్ విగ్రహ ఏర్పాటు అంశం మరోమారు తెరపైకి వచ్చింది. విగ్రహ ఏర్పాటును వ్యతిరేకిస్తూ బిజెపి రాష్ట్ర వ్యాప్తిత ఆందోళనలో భాగంగా రాష్ట్ర అధ్యక్షులు సోమూ వీర్రాజు ప్రొద్దుటూరు పర్యటనకు రావడంతో ఉద్రిక్త పరిస్థితిని తెచ్చిపెట్టింది. విగ్రహం ఏర్పాటు చేసే మైదుకూరు రోడ్డులోని జిన్నారోడ్డు సర్కిల్లో బిజెపి పెద్ద ఎత్తున చేయాలని ఛలో ప్రొద్దుటూరుకు పిలుపు నిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు భద్రతా ఏర్పాట్లలో భాగంగా పట్టణంలోని ప్రధాన వీధులను బారికేడ్లతో దిగ్భంధనం చేశారు. మైదుకూరు రోడ్డు, శివాలయం వీధి, హోమసపేట వీధులనుంచి ధర్నా ప్రదేశానికి జనం ఎవరూ రాకుండా కట్టడి చేశారు. దీంతో ప్రొద్దుటూరులో సామాన్య జన సంచారానికి ఇబ్బందులు ఏర్పాడ్డాయి. మరోవైపు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోమూ వీర్రాజు, ఇతర జిల్లా నేతలపై పోలీసులు గట్టి నిఘా ఉంచారు. సోమూ వీర్రాజు ఆందోళనకోసం రాత్రే రహస్యంగా పోలీసుల కళ్లుగప్పి కడప నుంచి ప్రొద్దుటూరుకు చేరుకున్నట్లు సమాచారం. టిప్పు సుల్తాన్ విగ్రహ ఏర్పాటు అంశంపై బిజెపి గట్టి ఆందోళనకు ఉపక్రమించడంతో ప్రొద్దుటూరులో ఎప్పుడు ఏంజరుగుతుందోనన్న టెన్షన్ నెలకొంది. అయితే సోమూవీర్రాజు ఆందోళనను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గోర్రెశ్రీనివాసులు ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆందోళనను ఏదో ఒక రూపంలో చేసి తీరుతామని వారు స్పష్టం చేశారు.

## రాజోలు వరదల్లో మత్స్యకారుడు గల్లంతు

రాజోలు జూలై 27, (న్యూస్ పల్స్)రాజోలులో వరద ప్రవాహంలో మత్స్యకారుడు గల్లంతయాడు. రాజోలు నున్నవారిబాడవ పల్లిపాలెంకు చెందిన కొప్పాడి కనకరాజు (55)వేటకు వెల్లి కాలుజారి వశిష్ట గోదావరిలో వరద ప్రవాహంలో పడి గల్లంతయ్యాడు. మృతునికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. సంఘటనా ప్రాంతానికి రెవిన్యూ, పంచాయతీ అధికారులు, పోలీసులు, సర్పంచ్ రేవు జ్యోతి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

## విశ్రాంత ఆచార్యులకు సీతక్క సన్మానం

ములుగు జూలై 27, (న్యూస్ పల్స్)రామప్ప దేవాలయంకు యునెస్కో గుర్తింపు రావడం కోసం అహర్నిశలు కృషి చేసిన రిటైర్డ్ ప్రొఫెసర్స్ పాండురంగారావుని, పాపారావుని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళ ప్రధాన కార్యదర్శి ములుగు ఎమ్మెల్యే సీతక్క శాలువాతో సన్మానించారు. రామప్ప దేవాలయంకు యునెస్కో గుర్తింపు రావడం కోసం ప్రపంచ దేశాలకు రామప్ప కళ సంపదను పరిచయం చేసిన ప్రోఫేసర్ పాండు రంగారావు పాపారావు ల కృషి ఎంతో ఉందని సీతక్క అన్నారు..ఈ కార్యక్రమములో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బై రెడ్డి బాగ్ వాన్ రెడ్డి,మండల అధ్యక్షులు చెన్నొజు సూర్యనారాయణ పాల్గొన్నారు.

# వైభవంగా గురు పౌర్ణమి పూజలు

కడప జులై 27 కడప లో ఈరోజురామకృష్ణ మిషన్ లో గురు పౌర్ణమి పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. స్వామి సన్నివాసానంద, బ్రహ్మచారి యోగి రాజ చైతన్య స్వామి సుకృతానంద భగవాన్ శ్రీ రామకృష్ణులకు విశేష పూజ హోమం నిర్వహించారు. అనంతరం స్వామి సుకృతానందజీ గురుపౌర్ణమి విశిష్టతను వివరిస్తూ " గురువు మాత్రమే భగత్ దర్శనం చేయించ సమర్ధుడని, గురువును, గురువాక్యాలను విశ్వసించి ఆధ్యాత్మిక సాధనలు చేసేవారు తప్పక భగవల్లాభం పొందగలరని" చెప్పారు.స్వామి శశికాంతానందజీ తమ సందేశాన్ని స్తూ" భారతీయ సనాతన ధర్మం లో గురువు పాత్ర విశిష్టమైనదని,రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద ఆదర్శవంతమైన గురుశిష్యులని, ఆధునిక కాలంలో వారి అనుబంధం ఆచరణీయ విధానమని" తెలిపారు.అనంతరం స్వామి సుకృతానందజీ రామకృష్ణ మిషన్ - కడప కార్యదర్శి బాధ్యతలను స్వామి శశికాంతానందజీకి అప్పగించారు.స్వామి సుకృతానంద స్వామి శశికాంతానందను కడప భక్తులకు పరిచయం చేసస్తూ" స్వామి శశికాంతానందజీ కార్య దక్షత కలవారని, అందరినీ ఏకతాటి మీద నడిపించి సమర్ధవంతంగా కార్యక్రమాలు నిర్వహించ గలరని, గతంలో మీరు సహాయ సహకారాలు అందించిన విధంగానే స్వామి శశి కాంతానందజీ కి కూడా సహకరించి, రామకృష్ణ మిషన్ - కడప ను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని, ఆ బాధ్యత మీ అందరి మీద ఉందని అన్నారు.భక్తులందరూ యథా శక్తి గా స్వామి సుకృతానందజీ ని సన్మానించి వారి కృతజ్ఞతలు తెలియజేశారు.అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమం లో స్వామి సన్నివాసానంద, స్వామి సంకర్షణానంద, స్వామి సర్గానంద, బ్రహ్మచారి యోగి రాజ చైతన్య, బ్రహ్మచారి శివేశ చైతన్య, బ్రహ్మచారి రాహుల్, పాల్గొన్నారు. శివరామిరెడ్డిగారి వందన సమర్పణ తో కార్యక్రమం ముగిసింది.భక్తులందరికి భోజన ప్రసాదం అందజేశారు.

## భారతదేశ రక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపిన మహోన్నత శాస్త్రవేత్త ఏపీజే.అబ్దుల్ కలాం...

కడప జులై 27 భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా కడప నగరంలోని కడప నగర టీడీపీ అధ్యక్షులు వి.ఎస్.అమీర్ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. వి.ఎస్.అమీర్ బాబు మాట్లాడుతూ...అబ్దుల్ కలాం తమిళనాడురాష్ట్రంలోని రామేశ్వరం లో ఒకముస్లిం కుటుంబంలో 1931అక్టోబర్ 15న జన్మించాడు. ఆర్థికంగా వెనుకబడిన,కుటుంబానికి సహాయంచేయడానికి చిన్నవయసులోనేన్యూస్ పేపర్లు వేసేవాడు. 1980లో ఎస్ఎల్వి-3 చెయ్యి రోహిణి విజయవంతంగాప్రవేశపెట్టింది.. అంతరిక్షం లోకిశాటిలైట్ ని పంపగలిగే కెపాసిటీఉన్న దేశాల లిస్టులో భారతదేశంకూడా చేరింది. భారత అంతరిక్షప్రయోగాలు పునాదులుపడ్డాయి.ఆ నాటి ప్రధానమంత్రిగాంధీ గారు ఫోన్ చేసి ప్రత్యేకంగాఅభినందించారు. ఆ తర్వాతిసంవత్సరం 1981లో కలం గారికిపద్మభూషణ్ అవార్డు దక్కిందని కొనియాడారుఆ తరవాత మన ఆర్మీ కోసం అగ్ని, పృథ్వి, నాగ్, ఆకాశ్ త్రిశూల్వంటి శక్తివంతమైన మిసైల్లుతయారు చేసి మన దేశాన్ని ఎవరిమీద ఆధారపడని ఒకశక్తివంతమైన దేశంగా మార్చారు.అందుకే కలాం ని మిసైల్ మ్యాన్ అని అంటారుభారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా అబ్దుల్ కలాం ప్రతిపాదించగా కాంగ్రెస్ కూడా మద్దతు తెలిపింది. అబ్దుల్ కలాం మనదేశానికి పదకొండవరాష్ట్రపతిగా 2002వసంవత్సరంలో ఏకగ్రీవంగా ఎన్నికై... ఏ రాజకీయ అనుభవం లేకుండారాష్ట్రపతి అయిన మొదటి వ్యక్తికలాం గారు. కలాం సమయంలోఎక్కవ మందిని కలుసుకున్నరాష్ట్రపతిగా, ×ఏమి పీపుల్స్ప్రెసిడెంట్× అని అంటారు.అబ్దుల్ కలాం గారు పెళ్లి చేసుకోలేదు. అంతేకాదు వైద్య రంగంలోపోలియో బాధితుల కోసంతేలికపాటి పరికరాల రూపకల్పనచేయడానికి ఎంతో కృషిచేశారు. భారత ప్రభుత్వం భారతరత్నా పద్మవిభూషణ్, పద్మభూషణ్ పురస్కారాలతోగౌరవించింది.2015 న జిల్లాలో యువతఉపన్యసిస్తున్న సమయంలోఒక్కసారిగా కుప్పకూలిపోయారుతెల్లని పెట్టని హాస్పిటల్లో చేర్చారుకానీ ఆయనలో చలనం లేదుసాయంత్రం ఏడు గంటల 45నిమిషాలకు గుండెపోటుకారణంగా చనిపోయాడనే వార్తదేశమంతా విని బాధ పడని వ్యక్తిఅంటూ ఎవరూ లేరు చివరిక్షణంలో కూడా ఆయనకి ఇష్టమైనయువత కోసం ప్రశ్నిస్తూనే తుదిశ్వాస విడిచారు.ఈ కార్యక్రమంలో కడప నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, కడప పార్లమెంట్ కార్యదర్శి మాసా కోదండ రామ్, మైనార్టీ నాయకుడు సి.ఎస్. నాసర్ అలీ పాల్గొన్నారు.

# టిడిపి నాయకుల డిమాండ్

నెల్లూరు జూలై 27, (న్యూస్ పల్స్) నెల్లూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రైతు నాయకులు, మాజీ అగ్రికల్చర్ మార్కెటింగ్ ఛైర్మెన్స్, నీటి సంఘాల అధ్యక్షుల స మావేశం నెల్లూరు పార్లమెంటు అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర హాజరు అయినారు.ఈ నవావేశంలో ఈ క్రింద అంశముల గురించి చర్చించి తీర్మానించదమైనది.కృష్ణ జలాల గురించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్ వలన రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా నెల్లూరు జిల్లా ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు .కావున కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని సమావేశం డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వై. యస్. జగన్మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం పై వత్తిడి తెచ్చి నోటిఫికేషన్ రద్దు చేయించి, సవరణలతో కూడిన కొత్త నోటిఫికేషన్ ఇప్పించాలి అని డిమాండ్ చేశారు.నోటిఫికేషన్ రద్దు అయ్యే వరకు అఖిలపక్ష పార్టీలతో కలసి జిల్లా వ్యాప్తముగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాలని సమావేశంలో తీర్మానం చేశారు.సోమశిల ఉత్తర కాలువకు సంబందించి గత ప్రభుత్వంలో మంజూరు అయిన పనులను రద్దు చేయడము వలన ఈ కాలువ క్రింద 40 వేల ఎకరాలలో సాగు ప్రశ్నార్ధకమైయింది అని అన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేసిన పనులను తిరిగి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. నెల్లూరు జిల్లాలో రెండో పంట క్రింద 1010 వారిని సాగు చేయడము గత కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 1010 రకం ధాన్యానిని ప్రభుత్వము కొనుగోలు చేయగా,ఈ ప్రభుత్వ హాయాములో ఈ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడము లేదన్నారు .అందువలన ఈ రకం ధాన్యాన్ని పండించిన రైతులు తప్పనిసరి పరిస్థితులలో తెగనమ్ముకొంటున్నారు అని పేర్కొన్నారు. కావున ప్రభుత్వం వెంటనే 1010 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు అవసరమైన ఉత్తర్వులు ఇవ్వాలని సమావేశం ప్రభుత్వాన్ని కోరుతూ డిమాండ్ చేశారు.ధాన్యం అమ్మి 3 నెలలు గడిచినా ఇంకా చాలామంది రైతులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించ లేదన్నారు. కావున ప్రభుత్వం వెంటనే ధాన్యం బకాయిలను చెల్లించాలని కోరుతూ సమావేశంలో తీర్మానం చేశారు.జిల్లాలో రైతులు పండించిన పసుపు, వేరు శనగ, పొగాకు, నిమ్మ కు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదన్నారు. అందువలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు అని తెలియజేశారు. గత తెలుగుదేశం హయాంలో ఇటువంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవడం జరిగిందన్నారు. అయితే ఈ ప్రభుత్వంలో వారిని గురించి పట్టించుకునే నాధుడే కరువయ్యారు అని అన్నారు. ఇప్పటికైనా పై పంటలను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .జిల్లాలో ఉన్న నెల్లూరు బ్యారెజి, సంగం బ్యారేజీ, సోమశిల హైలెవల్ కెనాల్ పేస్ 1, పేస్ 2 తదితర ప్రాజెక్టుల పనులు నత్తనడకన సాగుతున్నాయి అని ధ్వజమెత్తారు. జిల్లాకు చెందిన వ్యక్తి నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పటికిని, ఈ ప్రాజెక్టుల పనులు సరిగా జరగడం లేదని ఆరోపించారు. ఈ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సమావేశం ప్రభుత్వాన్ని కోరుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత తెలుగుదేశం హయాంలో వ్యవసాయ శాఖ ద్వారా పెద్ద ఎత్తున ఆధునిక వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేయడమే కాకుండా డ్రిప్ ఇరిగేషన్ కు పెద్ద ఎత్తున సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించడం జరిగిందన్నారు .అయితే ప్రస్తుత ప్రభుత్వం వీటన్నింటిని రద్దు ఒసేయ్ చేసిందన్నారు. రైతులకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వవలసిన వ్యవసాయ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తపరిచారు. రైతులకు గత ప్రభుత్వ హయాంలో ఇస్తున్న రాయితీలు అన్నింటిని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశంలో తీర్మానం చేశారు.ఈ సమావేశంలో గూడూరు మాజీ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ , నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి , తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి , మాజీ జడ్పీ చైర్మన్ పొన్నెబోయిన చంచల బాబు యాదవ్ , రైతు నాయకులు రాపూరు సుందర రామిరెడ్డి , కండ్లగుంట మధుబాబు, నెల్లూరు ప్రభాకర్ రెడ్డి, రావూరు రాధా కృష్ణ నాయుడు, పమిడి రవికుమార్ చౌదరి, కొండూరు పోలిశెట్టి, జలదంకి శ్రీహరి నాయుడు, వంటేరు జయచంద్రారెడ్డి, పులిగండ్ల మధుమోహన్, తిరుమూరు సుధాకర్ రెడ్డి, బీద గిరిధర్, బొమ్మి సురేంద్ర, అన్నం దయాకర్ గౌడ్, రైతు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## తుంగభద్ర నదికి వరద ముప్పు... ప్రమాద హెచ్చరికలు జారీ

### మంత్రాలయం నది తీరంలో బందోబస్తు

మంత్రాలయం జూలై 27, (న్యూస్ పల్స్) కర్ణాటకలో అధిక వర్షాలు పడడంతో తుంగభద్ర డ్యాంనిండు కుండలా పరవళ్లు తొక్కుతోంది. దీంతో డ్యామ్ అధికారులు మంగళవారం 33 గేట్లు తెరిచి డ్యాం లోని నీటిని తుంగభద్రా నదిలోకి వదిలారు. దీంతో తుంగభద్ర నది డ్యామ్ నీరు పరవళ్లు తొక్కుతూ ముందుకు సాగుతోంది. నదీతీర ప్రాంతాలు మండలంలోని గ్రామాలు మంత్రాలయం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం రాఘవేంద్ర స్వామి మఠం నది కైరవాడి నాగలదిన్నె గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఆదోని ఆర్డీవో నదీ తీర ప్రాంతాలలో అధికారులను హెచ్చరించారు. మంత్రాలయం తాసిల్దార్ దేవా చంద్రశేఖర్ ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండంతో రాఘవేంద్ర స్వామి మఠం సమీపంలోని పుష్కర ఘాట్ లోకి స్థానాలకు ఎవరు వెళ్ళకూడదని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సిఐ.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎస్సై వేణుగోపాల్ రాజు, బాబు నది తీర ప్రాంతంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీ మఠం అధికారులు కూడా శ్రీ మఠం సిబ్బందితో నది తీర ప్రాంతంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. వ్యాపారస్తులు అప్రమత్తంగా ఉండాలని రాఘవేంద్ర స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు స్నానాలకు నదిలోకి ఎవరు వెళ్ళకూడదని హెచ్చరికలు జారీ చేశారు. వరద నీరు అదికంగా రావడంతో నదిలో నుండి పాములు మొసళ్ళు చేపలు వస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంత్రాలయంలో ఒక బారీ చేప ఎగురుతు ఉంటే కరెక్ట్ గా ఒక బారీ మొసలి నోరు తెరవటంతో ముసలి నోట్లోకి బారీచేప ఇరుక్కు పడింది. ఆ దృశ్యం చూపరులను ఆశ్చర్యంతో పాటు సంతోషాన్ని నింపింది.తర్వాత ఒళ్ళు జలదరించి ఆ దృశ్యాన్ని చూసి చూపరులు భయంతో దడుసుకున్నారు. వరద నీటిని చూడడానికి కూడా ప్రజలు అధిక సంఖ్యలో తుంగా తీరం చేరుకున్నప్పటికీ అధికారులు అప్రమత్తంగా ఉండటంతో దూరంనుంచి ప్రజలకు వీక్షించారు. శ్రీ మఠం పీఠాధిపతులు మంగళవారం హాస్పిటల్ లోని తుంగభద్ర డ్యామ్ చేరుకొని వరద నీటిని సమీక్షించారు. అనంతరం తుంగభద్రా నదికి పూజలు చేసి హారతులు ఇచ్చారు.

## బీజేపీ నిరసన

విశాఖపట్నం రాష్ట్రం లో వైసిపీ ప్రభుత్వం ఏర్పడ్డాక అరాచక పాలన కొనసాగుతోందని, వి యం ఆర్ డి ఏ మాస్టర్ ప్లాన్ ని పూర్తి గా రద్దు చేయాలని బీజేపీ నేతలు మాధవ్, విష్ణుకుమార్ రాజు డిమాండ్ చేశారు. విశాఖ కే తలమానికమైన వీఎం ఆర్ డి ఏ తయారు చేసిన మాస్టర్ ప్లాన్ ని వ్యతిరేకిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో వీఎం ఆర్ డి ఏ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఆశాస్రీయ విధానం లో తయారు చేసిన మాస్టర్ ప్లాన్ మార్చాలని , ప్లాన్ లో వున్న అభ్యంతరాలు తెలపడానికి ఇచ్చిన గడువు తేదీ పెంచాలని డిమాండ్ చేశారు.మాస్టర్ ప్లాన్ ముసాయిదా ఆంగ్ల బాషలో కాకుండా ప్రజలు అందరి కీ అర్ధం అయ్యే విదంగా తెలుగు లో ఇవ్వాలని తెలిపారు. డబ్బై అయిదు లక్షల జనాభా పై ప్రబావం చూపే ఈ ప్లాన్ పై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు

## తిరుమలేశునికే మోసం చేసిన బీజేపీ దేవాలయాల యాత్రలా !

### యూత్ కాంగ్రెస్

కడప జులై 27కడప కాంగ్రెస్ కార్యాలయములో ప్రెస్ మీట్ లో 2014లో అధికారంలోకి రాక ముందు ప్రత్యేక హోదా ఇస్తామని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రజలను నమ్మించి తిరుపతి వెంకన్న సాక్షిగా ఇచ్చిన మాట తప్పిన బిజేపీ దేవాలయాల యాత్ర చేయటం హాస్యంగా వుందని యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెప్పలి పుల్లయ్య అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీకార్యాలయంలో యేర్పాటుచేసినవిలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రా ప్రజల ఆరాధ్య దైవం తిరుపతి వెంకన్న సన్నిధిలో మోడిగారు ఆంధ్ర ప్రదేశ్కు ప్రత్యేక హోదా ఇస్తామని మాట మార్చడం జరిగిందన్నారు. ఇప్పుడు సిగ్గు లేకుండా బీజేపీ రాష్ట నాయకులు దేవాలయాలు సందర్శన యాత్ర చేయటం మీకే చెల్లిందని ఘాటుగా విమర్శించారు.మీకేమైనా దేవుని పట్ల భక్తి,వున్నట్లయితే మీ నాయకుడు ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఆంధ్ర ప్రదేశ్కు ప్రత్యేక హోదా ఇచ్చే విదంగా మీరు పోరాటం చెయ్యాలని సూచించారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా మీరు చెప్పే మాటలు, చేసే డ్రామాలు ఆంధ్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బిజేపీ రాష్ట నాయకులు ఢిల్లీ పెద్దలతో ఆంధ్ర ప్రదేశ్ హోదా పై పోరాటం చెయ్యాలని అలా కాకుంటే రాష్ట్రంలో రాజకీయ లబ్ది కోసం మీరు దేవాలయాల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేయడం ద్వారా మీకు ఒరిగేది ఏమీ లేదన్నారు.నిత్యావసరాల ధరలు మండిపోతుంటే సామాన్యుల బ్రతుకు కష్టంగా మారితే, వాటి గురించి బిజేపీ నాయకులు నోరు మెదపడం లేదని అన్నారు. బీజేపీకి కాలంలో చెల్లిందని కేంద్రంలో 2024లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ఆంధ్ర ప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇచ్చి తీరుతుందని అన్నారు.


## టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటుపై వ్యతిరేకత

### ప్రొద్దుటూరులో ఉద్రిక్తత

ప్రొద్దుటూరుజులై27 కడప జిల్లా ప్రొద్దుటూరులో ఉద్రిక్తత నెలకొంది. పట్టణంలో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటును వ్యతిరేకిస్తూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు పురపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. స్థానిక డీఎస్పీ ప్రసాదరావు నేతృత్వంలో పోలీసులు ధర్నాను అడ్డుకునేందుకు యత్నించారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, భాజపా నేతలు, కార్యకర్తలకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. ధర్నాను విరమించుకొని టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేసిన ప్రదేశానికి వెళ్లాలని ప్రయత్నించిన భాజపా నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో చాలాసేపు తోపులాట జరిగింది. అనంతరం అక్కడే బైఠాయించిన భాజపా నేతలను ఆందోళన విరమించాలని డీఎస్పీ కోరారు. వారు ఒప్పుకోకపోవడంతో రంగంలోకి దిగిన పోలీసులు నేతలను అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు. మరోవైపు స్థానికంగా ఉన్న జిన్నా రోడ్డులో టిప్పు సుల్తాన్ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్రెడ్డి ఇటీవల భూమిపూజ చేసిన విషయం తెలిసిందే.

## ఆగస్టు కల్లా అందుబాటులోకి కోవిడ్ టీకాలు

న్యూఢిల్లీ జూలై 27 ఆగస్టు కల్లా చిన్నపిల్లలకు కోవిడ్ టీకాలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సూక్ మాండవీయ వెల్లడించారు. ఇవాళ బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తమ పార్టీ ఎంపీలకు చెప్పినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇవాళ రాజ్యసభలోనూ పిల్లల వ్యాక్సినేషన్ గురించి ఓ సభ్యుడు ప్రశ్నించారు. ఆ సమయంలో మంత్రి సమాధానం ఇవ్వబోయారు. కానీ విపక్ష సభ్యుల నినాదాల మధ్య ఆరోగ్య మంత్రి ఇచ్చిన సమాధానం సరిగా వినపడలేదు. ప్రస్తుతం ఇండియాలో రెండు కోవిడ్ టీకాలను పిల్లలపై ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. జైడస్ క్యాడిలా ఇచ్చిన రిపోర్ట్ను డ్రగ్ రెగ్యులేటర్ పరిశీలిస్తున్నది. 12 నుంచి 18 ఏళ్ల మధ్య పిల్లలపై జైడస్ కోవిడ్ టీకా ట్రయల్స్ నిర్వహించింది. ఇక భారత్ బయోటెక్ సంస్థ కూడా 2 నుంచి 18 ఏళ్ల మధ్య ఉన్న పిల్లలపై రెండవ, మూడవ దశ ట్రయల్స్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ రెండు టీకాల ఫలితాల ఆధారంగా వ్యాక్సినేషన్ ప్రక్రియ ఉంటుందని ఇటీవల లోక్సభలో కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి పవార్ తెలిపారు. దేశవ్యాప్తంగా స్కూళ్ల రీఓపెనింగ్ చేపట్టనున్న నేపథ్యంలో .. పిల్లలకు కోవిడ్ వ్యాక్సిన్ ఇవ్వడం కీలకమైందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



# జగన్నాథ గట్టు ఇందిరమ్మ కాలనీలో విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర వసతులను యుద్ధ ప్రాతిపదికన కల్పించండి

**అధికారులకు ఆదేశించిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు**

కర్నూలు, జులై 27 ( విభారె) కర్నూలు రూరల్ మండలం, దిన్నెదేవరపాడు గ్రామపంచాయతీ జగన్నాథ గట్టు ఇందిరమ్మ కాలనీలో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర వసతులు కల్పించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఉదయం కర్నూలు రూరల్ మండలం, దిన్నెదేవరపాడు గ్రామ పంచాయతీ జగన్నాథ గట్టు లో గతంలో నిర్మించిన ఇందిరమ్మ కాలనీలోని గృహ నిర్మాణాలను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హఫీజ్ ఖాన్, డా జె.సుధాకర్, జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ, రైతు భరోసా) రామ సుందర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ (హౌసింగ్) నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ డి.కె బాలాజీలతో కలిసి పరిశీలించారు. అందులో భాగంగా జగన్నాథ గట్టు ఇందిరమ్మ కాలనీలో ఏ ఏ వసతులు ఉన్నాయి, ఇంకా ఏ మౌలిక వసతులు కల్పించాలి వంటి వివరాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకు మునుపు ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన గృహంలోకి వెళ్లి బెడ్ రూమ్, హాలు, కిచెన్ తదితర గదులను స్వయంగా పరిశీలించారు. బోర్లు వేస్తే నీళ్ళు పడతాయా వంటి వివరాలను అధికారులను అడగగా 500 అడుగులలో నీరు పుష్కలంగా ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే బోర్లు వేసి కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలకు త్రాగునీటి సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి వారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యేలకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, హౌసింగ్ ఈఈ నాగరాజు, కర్నూలు ఆర్ డి ఓ హరిప్రసాద్, కర్నూలు రూరల్ తహసీల్దార్ వెంకటేష్ నాయక్, హౌసింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నదీ తీర ప్రాంతాలను సందర్శించిన ఆర్డీవో

ఆదోని జులై 27 ( విభారె)కర్ణాటక రాష్ట్రంలో భారీగా వర్ష పాతం నమోదైన కారణంగా హోస్పేట్ తుంగభద్ర డ్యామ్ లో భారీగా వరద నీరు తో నిండు కుండ ల ఉన్న డ్యాం సోమవారం మధ్యాహ్నం 01గంటలకు 33 గేట్లు ఎత్తి సుమారు లక్ష 20 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా మంగళవారం ఆదోని ఆర్డీవో జి. రామకృష్ణ రెడ్డి డివిజన్ లోని నదీ తీర ప్రాంతాలను పర్యటిస్తూ ప్రజలు ఎవరు నదీ తీరానికి ఎవరు రావద్దన్నారు, నది తీరంలో కి మత్స్యకారులు చేపల వేటకి వెళ్లరాదన్నారు,ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆర్డిఓ ఆదేశించారు.నేపథ్యంలో ఆదోని డివిజన్లో నది తీరంలో ఉన్న మండల స్థాయి అధికారులందరూ నిరంతరం అప్రమత్తంగా ఉండండి ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలలోకి ప్రజలెవరూ దిగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకొని ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలలోకి ప్రజలెవరూ దిగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని డివిజన్ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు సిబ్బంది అందరూ కూడా అందుబాటులో ఉండి ఎక్కడ ఏ అవసరం వచ్చినా వెంటనే తరలివెళ్లి ప్రజలకు సాయం చేసేలా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో అధికారులు ఆర్డీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాత బ్రిడ్జి కూలక మునుపే కొత్త బ్రిడ్జి నిర్మించాలి

**సీపీఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ డిమాండ్**

నంద్యాల జులై 27 ( విభారె)కుందు నది మద్ది లేరు వాగుపై నిర్మిస్తున్న వంతెనను సత్వరమే గా కాకుండా త్వరగా పూర్తి చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం మీడియా ప్రతినిధుల తో మాట్లాడుతూ కుందు నది పై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగిందన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఏఐటియుసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు నందమూరి నగర్ సిపిఐ శాఖ కార్యదర్శి హుస్సేన్ సా పాల్గొన్నారు. అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ కుందు నది పై గత టిడిపి ప్రభుత్వ కాలం నుండి ఇప్పటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వరకు సంవత్సరాల నుండి కుందు నదిపై వంతెన నిర్మించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వచ్చిందంటే జీవాల సంత వల్ల అక్కడ పాత బ్రిడ్జి అంతా ట్రాఫిక్ జామ్ అవుతుందని అన్నారు. ఆ బరువుకు పాత బ్రిడ్జి కూలుతుంది అని ప్రజలు భయపడుతూ ఉంటారని తెలిపారు. అంతేకాకుండా వేల సంఖ్యలో వాహనాలు ఎస్ ఆర్ బి సి. నందమూరి నగర్. వైయస్ నగర్. పులిమద్ది మునగాల. పోలూరు .. అనేక గ్రామాల ప్రజలు ఆ బ్రిడ్జి మార్గం ద్వారా రాకపోకలు జరుగుతూ ఉంటాయన్నారు. కావున తొందరగా పాత బ్రిడ్జి కూలకముందే కొత్త బ్రిడ్జి నిర్మాణం పనులు చేయాలని కోరారు. కాంట్రాక్టు వారు వర్షాకాలం వస్తే పనులు ప్రారంభిస్తారని తూతూమంత్రంగా పనులు మొదలు పెట్టి. వరదలు వచ్చి వంతెనకు తోలిన కంకర సీమెంట్ వరదలో కొట్టుకుపోయిన వని మరలా బిల్లు పెట్టుకుని ఆ రకంగా ప్రభుత్వ సొమ్మును గండి కొడుతూ కాలయాపన చేస్తు ఉంటారని ఆయన అన్నారు. . ఇప్పటికైనా ఆ వంతెనను త్వరగా పూర్తి చేయాలి అని అన్నారు. లేని పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి గా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. . ఈ కార్యక్రమంలో చిన్న నాగన్న వెంకటరమణ లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏ ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

తుగ్గలి జులై 27 ( విభారె) రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామ రెవిన్యూ సహాయకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వీఆర్ఏలు డిమాండ్ చేశారు.తుగ్గలి మండలం పరిధిలోని ఉప్పర్లపల్లి గ్రామంలో తుగ్గలి మండల వీఆర్ఏలు పత్తికొండ ఎమ్మెల్యే ను కలిసి తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ వేతనం రూ. 21,000 లు ఇవ్వాలని,పే స్కేల్ ఇవ్వాలని,నామినీలుగా పనిచేస్తున్న వారందరికీ విఆర్ఏలుగా నియమించి, డి.ఎ ను వేతనం నుండి మినహాయించటాన్ని విరమించుకోని,అర్హులైన విఆర్ఏ లకు విఆర్ఓలుగా ప్రమోషన్స్ ఇవ్వాలని కోరుతూ జూలై,ఆగష్టు లలో జరగనున్న దశలవారీ ఆందోళనా పోరాటాలను జయప్రదం చేయాలని ఎ.పి. గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిస్తున్నదని వీఆర్ఏలు తెలియజేశారు.ముఖ్యమంత్రి హామీని నిలబెట్టుకోవాలి : ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి 2017 మార్చి 24న అలంకార్ సెంటర్లో విఆర్ఎ ల ధర్నాకు హాజరై విఆర్పిలకు కనీస వేతనం ఇస్తామని,నామినీలకు న్యాయం చేయటంతో పాటు ఇతర సమస్యలన్ని పరిష్కరిస్తామని నాడు ప్రతిపక్షనేతగా హామి ఇచ్చి ఉన్నారు. వైయస్ఆర్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు దాటినా విఆర్ఏలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవటం అన్యాయం. వెంటనే ముఖ్యమంత్రి గారి హామి అమలుకు చర్యలు చేపట్టాలని ఎ.పి. గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం డిమాండ్ చేస్తుందని వారు తెలియజేసారు.

**నామినీలను విఆర్ఏ లుగా నియమించాలి**

నామినీలకు విఆపలుగా నియమించాలి : రాష్ట్ర వ్యాపితంగా పనిచేస్తున్న విఆర్ఎలలో చాలామంది అనారోగ్యంతో,వయస్సు పైబడి విధులు నిర్వర్తించలేక పోవడంతో వారి వారసులువిఆర్ఏల విధులు నిర్వర్తిస్తున్నారు.అనేక సంవత్సరాలుగా నామినీలుగా పనిచేస్తున్న వీరిని విఆర్ఏలుగా నియమించాలని కోరుతున్నా, నేటికి సమస్య పరిష్కారం కాలేదు. గత ప్రభుత్వం నామినీలనువిఆర్ఏ లుగా నియమించేందుకు ప్రతిపాదనలు తయారు చేసినప్పటికి అనేక కుంటిసాకులు చేబుతూ ఆ ప్రతిపాదనలను ప్రక్కన పెట్టిందని వెంటనే వీఆర్ఏల సమస్యలను పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు.మండల కేంద్రాలలో నిరసనలు,ఆర్డిఓ కార్యాలయం వద్ద నిరసనలు,కలెక్టరేట్ల వద్ద నిరసనలు చేపట్టామని,చివరిగా ఆగస్టు 2,3,4 తేదీలలో విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నాలను నిర్వహిస్తున్నట్లు వీఆర్ఏలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్ఏ లు రమేష్, రామాంజనేయులు, శేఖర్, పులికొండ,చౌడప్ప, తదితరుల వీఆర్ఏలు పాల్గొన్నారు.

# తుంగభద్ర నది తీరంలో వరద కాలువలు నిర్మిచండి

**రైతు సంఘం ఆధ్వర్యంలో తుంగభద్ర నది వరద నీరు పరిశీలన**

కౌతాళం జులై 27 ( విభారె) మండలంలోనే మెలిగానూర్ గ్రామం నందు సిపిఎం పార్టీ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు పరిశీలన వారు మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం పైభాగమున అధికంగా వర్షాలు కురవడం వల్ల డ్యామ్ పూర్తిగా నిండి 33 గేట్లు ఎత్తి 140000 వేలు క్యూసెక్కులు నీళ్లు కిందకు వదిలినారు. నదీతీర పరీవాహక గ్రామాలు నీట మునిగి, పంట పొలాలు, మోటర్లు నీటిలో మునిగిపోయాయి. నదీతీర గ్రామ ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.ప్రతి సంవత్సరం వరదల సందర్భంగా గా 70 ,80 టీఎంసీలు వృథాగా సముద్రం పాలవుతున్నాయి ఆ నీటిని సద్వినియోగం చేసుకుంటే నాలుగు నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతున్నాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య అన్నారు.మెలిగానూర్ దగ్గర వరద కాలువ నిర్మిస్తే ఇక్కడి నుంచి ఆత్మకూరు కొరకు మీరు తీసుకోవచ్చని రిటైర్డ్ ఇంజనీర్ సుబ్బారాయుడు గారు తెలిపినారు. దానికి సంబంధించిన ప్లాను గత ప్రభుత్వ అధికారులకు, నాయకులకు, ఇరిగేషన్ మంత్రులకు ఇచ్చిన ప్రయోజనం లేదు.ఈ ప్రభుత్వమైనా ఈ వరద నీరు ఉపయోగించుకుంటే నాలుగు నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతున్నాయి వరద నీరు అరికడితే ఆస్తి ప్రాణ నష్టం నివారించిన వరవుతారని పేర్కొన్నారు.

# 28 నుంచి అమరవీరుల సంస్మరణ సభలు

విశాఖపట్నం మల్కన్ గిరి కొరాపుట్ విశాఖ బోర్డర్ డివిజన్ మావోయిస్టు కార్యదర్శి రాకేష్ అలియాస్ సునీల్ ఆడియో వాయిస్ విడుదల అయింది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మా పార్టీపైన, ప్రజలపైన ఆపరేషన్ పహార్ పేరుతో తీవ్రమైన అణిచివేతకు గురిచేస్తున్నాయి. ఈ అణిచివేత దాడులను ప్రతిఘటిస్తూ ప్రజలు జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు గ్రామగ్రామాన అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించాలని పిలుపుని ఇస్తున్నామని అయన లేఖలో పేర్కొన్నారు. ఈ సంవత్సర కాలంలో ఆంధ్రా,ఒరిస్సా బోడర్ లో 13 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు.

# గౌతమ్ కృష్ణకు అన్నయ్యలా కనిపిస్తున్నాడు!



సూపర్ స్టార్ మహేష్ వయసు ఎంత..? ఠకీమని చెప్పేయడం కష్టమే. అతడి ఏజ్ 45 అంటే అంతా షాకింగ్ గానే చూస్తారు. కానీ అది నిజమేనని గట్టిగా చెబితేనే నమ్ముతారు. అంతగా అతడు ఆ లుక్ ని ఛరిష్మాని మెయింటెయిన్ చేస్తూ సర్ ప్రైజ్ చేస్తున్నారు. మహేష్ ఇంకా 18 ప్లస్ అంటే నమ్మేసేంతగా లుక్ ని ఆవిష్కరించడం ప్రతిసారీ షాకిచ్చే విషయమే.టాలీవుడ్ లో మహేష్ శైలి పూర్తిగా విలక్షణమైనది. లుక్ పరంగా అతడి ఎంపికలు వేరు. నిజానికి ప్రభాస్ .. రానా .. చరణ్.. బన్ని లాంటి స్టార్లు భారీగా కండలు పెంచి మ్యాకో మ్యాన్ లుక్ తో కనిపించేందుకు ప్రయత్నిస్తే అందుకు భిన్నంగా మహేష్ అల్ట్రా స్మార్ట్ లుక్ కోసం తపించడం ఆసక్తిని కలిగిస్తోంది. ఇంతకుముందు సుకుమార్ 1-నేనొక్కడినే మూవీ కోసం మొదటి సారి షర్ట్ విప్పి చూపించాడు. అది కూడా వెనక వైపుగా క్షణ కాలం చూపించి వదిలేశారు. కానీ ఆ తర్వాత కూడా అతడు పూర్తిగా షర్ట్ విప్పి మ్యాకో మ్యాన్ లా ఎప్పుడూ కనిపించలేదు.అయితే మహేష్ తన రూపానికి తగ్గట్టు అద్భుతమైన ఫిజిక్ తో మైమరిపిస్తూ ఇప్పటికీ టీనేజర్ లానే కనిపిస్తున్నారు. కెరీర్ ఆరంభం నుంచి అతడు ఇస్మార్ట్ లుక్ తోనే కనిపించారు. మొదటి సినిమా 'రాజకుమారుడు'లో నటించినప్పుడు .. ఆ తర్వాత 'యువరాజు' సినిమాలోనూ కాస్త చబ్బీగా కనిపించిన మహేష్ .. మురారిలో విలేజ్ బోయ్ తరహా లుక్ తో కనిపించారు. ఇక పూరి జగన్నాథ్ తెరకెక్కించిన పోకిరి తో అతడి లుక్ పూర్తిగా మారిపోయింది. ఆ సినిమాలో నెవ్వర్ బిఫోర్ అనిపించేంత స్టైలిష్ గా కనిపించారు.ఇటీవల తన కెరీర్ 25వ సినిమా మహర్షిలో ఏకంగా కాలేజ్ బోయ్ లా కనిపించి సర్ ప్రైజ్ చేశారు. పోకిరి తర్వాత లాంగ్ జర్నీని సాగించాక కూడా 2019 నాటికి అతడు అలా కనిపించడం బిగ్ సర్ ప్రైజ్.. 'భరత్ అనే నేను'లో స్టైలిష్ సీఎంగా కనిపించిన మహేష్ ప్రస్తుతం పరశురామ్ దర్శకత్వంలో డ్యూయల్ షేడ్ ఉన్న పాత్రలో నటిస్తున్నారు. ఇందులో మాస్ అవతార్ లో కనిపిస్తూనే స్టైలిష్ బిజినెస్ మేన్ లుక్ లోనూ కనిపిస్తాన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. దుబాయ్ .. హైదరాబాద్ సహా పలు అందమైన లొకేషన్లలో ఈ చిత్రాన్ని అత్యంత రిచ్ లుక్ తో తెరకెక్కిస్తున్నారు. ఇందులో మాస్ యాక్షన్ మరో లెవల్లో ఉంటుందని థమన్ బాణీలు పెద్ద ప్లస్ కానున్నాయని కూడా టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఈ మూవీలో కొన్ని సీన్లు మైండ్ బ్లాక్ చేసే రేంజులో వచ్చాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.థమ్సప్ ప్రకటనలో ..!మరోవైపు మహేష్ థమ్సప్ యాడ్ లో ఏకంగా టీనేజర్ లా కనిపిస్తూ షాకిస్తున్నారు. ఆయన గౌతమ్ కృష్ణ (మహేష్ వారసుడు)కు అన్నయ్యా? అన్నంత యంగ్ గా కనిపిస్తున్నారని అభిమానులు కామెంట్ చేస్తున్నారు. తాజాగా ఖాళీ చేసిన థమ్సప్ బాటిల్ ని చూపిస్తూ మహేష్ ఇచ్చిన ఫోజులు వైరల్ గా మారాయి. అన్నట్టు కెరీర్ ఆరంభం నుంచి మహేష్ ని థమ్సప్ కంపెనీ వదిలినట్టే లేదు. మెగాస్టార్ చిరంజీవి .. చరణ్ లాంటి స్టార్లు థమ్సప్ కి కొన్నాళ్ల పాటు ప్రచారం చేసారు. ఇటీవల మహేష్ ఖాతాలోనే పర్మినెంట్ గా ఉంది ఈ బ్రాండ్. బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ తో కలిసి మహేష్ థమ్సప్ యాడ్ లో నటించిన సంగతి తెలిసిందే.

# ప్రభాస్ - నాగ్ అశ్విన్ మూవీ షురూ.. మెగాస్టార్ పై కీలక సన్నివేశాలు షూట్

నిన్న మొన్నటి వరకు ప్రభాస్ మహానటి ఫేమ్ నాగ్ అశ్విన్ కాంబో మూవీ వచ్చే ఏడాది లో ప్రారంభం అవుతుందనే వార్తలు వచ్చాయి. కాని అనూహ్యంగా చిత్ర యూనిట్ సభ్యులు రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరణ మొదలు పెట్టారు. ఒక చిన్న షెడ్యూల్ ను రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన సెట్టింగ్ లో నిర్వహిస్తున్నారట.బాలీవుడ్ మెగాస్టార్ అమితాబచ్చన్ ఈ సినిమా చిత్రీకరణలో పాల్గొంటున్నాడు అంటూ వార్తలు వస్తున్నాయి. అమితాబచ్చన్ కూడా ఈ విషయమై ట్విట్టర్ లో పేర్కొన్నాడు. రామోజీ ఫిల్మ్ సిటీలో వారం రోజుల వరకు ఈ చిన్న షెడ్యూల్ ను అమితాబచ్చన్ పై షూట్ చేస్తారట. అమితాబచ్చన్ డేట్లు వృదా అవ్వకూడదు అనే ఉద్దేశ్యంతో దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ షెడ్యూల్ ను ప్లాన్ చేశాడని తెలుస్తోంది. ఈ షెడ్యూల్ లో ప్రభాస్ పాల్గొంటాడా లేదా అనే విషయమై క్లారిటీ లేదు.అమితాబచ్చన్ మరియు ప్రభాస్ కాంబోలో సన్నివేశాలు చిత్రీకరించే విషయమై యూనిట్ సభ్యుల నుండి ఎలాంటి అప్ డేట్ లేదు. ప్రస్తుతం ప్రభాస్ రాధే శ్యామ్ సినిమా షూటింగ్ లో పాల్గొంటున్నాడు. అయితే షూటింగ్ గ్యాప్ లో అమితాబచ్చన్ ను ప్రభాస్ కలువబోతున్నాడు. షూటింగ్ లో ప్రభాస్ జాయిన్ అయినా కాకున్నా కూడా ఒక సారి మర్యాదపూర్వకంగా అయినా బిగ్ బాస్ కలుస్తాడని ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.పెద్ద ఎత్తున అంచనాలున్న ఈ సినిమా టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ తో రూపొందబోతున్నట్లుగా చెబుతున్నారు. ఈ సినిమా పాన్ ఇండియా మూవీగా కాకుండా హాలీవుడ్ మూవీ రేంజ్ లో ఉంటుదనే నమ్మకంను యూనిట్ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు.హాలీవుడ్ కు చెందిన పలువురు టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం వర్క్ చేయబోతున్నారు. అద్బుతమైన కథను అంతకు మించిన అద్బుతమైన కథనంతో రూపొందించబోతున్నట్లుగా తెలుస్తోంది. దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ సినిమా కోసం దాదాపుగా రెండేళ్లుగా వర్క్ చేస్తున్నారు. ప్రతి విషయంలో కూడా ఆయన చాలా జాగ్రత్తలు తీసుకుని మరీ ప్లాన్ చేస్తున్నాడు.ఇంత భారీ సినిమా ను సైలెంట్ గా ప్రార ంభించడం పట్ల అభిమానులు అసంతృప్తిగా ఉన్నారు. భారీ వేడుక నిర్వహించి ఆ తర్వాత షూటింగ్ ను మొదలు పెట్టి ఉంటే బాగుండేది అంటున్నారు. దర్శకుడు నాగ్ అశ్విన్ సినిమా షూటింగ్ సమయంలో పెద్దగా హడావుడి చేయడు. ఆయన సినిమాలు విడుదల అయిన తర్వాత హడావుడి చేస్తా యి.ప్రభా స్ తో చేయబోతున్న సినిమా విషయంలో కూడా అదే పున రావృతం అవుతుందని అంతా నమ్మకంగా ఉన్నారు. ఈ సినిమాను వైజయంతి మూవీస్ బ్యానర్ లో అశ్వినీ దత్ ఈ సినిమాను నిర్మించబోతున్న విషయం తెల్సిందే. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపిక పదుకునే తో పాటు పలువురు బాలీవుడ్ స్టార్స్ ఇంకా సౌత్ స్టార్స్ ఈ సినిమాలో నటిం చబోతు న్నారట.షూటింగ్ నేడు ప్రారం భం అవ్వడం.. అమితాబచ్చన్ కూడా షూటింగ్ లో జాయిన్ అవ్వడం వల్ల వచ్చే ఏడాదికి ఈ సినిమా వచ్చే అవకాశాలు ఉన్నాయా అంటూ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



# కళ్లతోనే కుర్రాళ్ల గుండె కోసేస్తున్న బిగ్ బాస్ దివి

అందానికి అందం ప్రతిభ మెండుగా ఉంటే టాలీవుడ్ నుంచి ఆశీస్సులు దక్కుతాయనడంలో సందేహమేం లేదు. సినీరంగంలో చాలామంది తెలుగమ్మాయిలు తారాపథంలోకి దూసుకెళుతున్నారు. కెరీర్ ని మరో లెవల్ కి విస్తరించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఒకసారి క్లిక్కయితే ఆదాయ ఆర్జనకు ఇక్కడ కొదవేమీ లేదు. ఇక బిగ్ బాస్ సీజన్ 4లో సందడి చేసిన హైదరాబాదీ మోడల్ దివి వద్యత ప్రస్తుతం క్రేజీగా అవకాశాలను అందుకుంటూ సత్తా చాటుతున్నారు. ఇటీవల టైమ్స్ మోస్ట్ డిజైరబుల్ ఉమెన్ 2020 జాబితాలో దివి అగ్ర పథాన నిలిచి మరోసారి అటెన్షన్ ని తనవైపు తిప్పేసుకుంది. దివి అందచందాలు వైరల్ ప్రమోషన్ యువతరానికి నచ్చేయడంతో మోస్ట్ డిజైరబుల్ జాబితాలో చేర్చేశారు.దివి వద్యత పేరు ఇటీవల టాలీవుడ్ లో ఓ రేంజులోనే మార్మోగుతోంది. తెలుగులో ప్రముఖ దర్శకనిర్మాతలు దివి పేరును పరిశీలిస్తున్నారని సమాచారం. ఇక ఇన్ స్టా మాధ్యమంగానూ ఈ బ్యూటీ హాట్ కంటెంట్ పై ముచ్చటించని కుర్రాళ్లు లేనే లేదు. అంతగా పాపులారిటీ తెచ్చుకునేందుకు నిరంతరం వేడెక్కించే ఫోటోషూట్లతో ఇన్ స్టా వేదికపై దర్శనమిస్తోంది. మరోవైపు నటిగా ప్రతిభను చూపించేందుకు తపిస్తోంది.దివి నటించిన క్యాబ్ 'స్టోరీస్ వెబ్' వెబ్ సిరీస్ యూత్ లో బాగానే క్లిక్కయ్యింది. దివి అందచందాలు నటన మత్తెక్కించాయి. మునుముందు ఈ బ్యూటీకి మెగా కాంపౌండ్ అక్కినేని కాంపౌండ్ నుంచి మంచి అవకాశాలు దక్కనున్నాయని సమాచారం.మరోవైపు దివి వద్యత లేటెస్ట్ ఫోటోషూట్ అంతర్జాలంలో సునామీ సృష్టిస్తోంది. దివి ట్రెడిషనల్ లుక్ లో ఎంతో ప్లెజెంట్ గా కనిపిస్తోంది. వైట్ అండ్ లైట్ ఎల్లో మిక్స్ డ్ కలర్ తో పరికిణీ డిజైనర్ బ్లౌజ్ ధరించిన దివి మెడలో ముత్యాలహారం ధరించింది. ఇక ఆ కాలికి వెండి పట్టీలు చేతులకు బంగారు గాజులు ఎంతో అందాన్ని తెచ్చాయి. క్రీగంటి చూపుతో కుర్రాళ్ల గుండె కోసేస్తోంది ఈ బ్యూటీ. ప్రస్తుతం ఈ ఫోటో వైరల్ గా మారింది.



# చై మంచి నటుడే కాదు.. అంతకు మించి..!

అక్కినేని బుల్లోడు నాగచైతన్య ఎంత సిగ్గరో అంతటి మల్టీ ట్యాలెంటెడ్ పర్సనాలిటీ. నటుడు కాకముందు చదువుల్లో చాలా చురుగ్గా ఉండేవాడు. అటుపై వ్యాపార రంగంలోనూ రాణించాడని అక్కినేని కాంపౌండ్ వర్గాలు చెబుతుంటాయి. కింగ్ నాగార్జున వారసుడిగా.. దగ్గుబాటి మనవడిగా బిజినెస్ ఐడియాలజీ అనేది చైతన్యకు చిన్నప్పటినుంచే అబ్బిందన్నది ఒక వాదన.అదే సమయంలో నాగచైతన్యకు క్రీడలపై అమితాసక్తి. చై చాలా ప్యాషనేటెడ్.. ఆ ఫ్యాషన్ తోనే స్కాంట్లాడ్ లో బ్రిటన్ ఎఫ్-1 రేసర్ గాను రాణించారు. క్రికెట్ పైనా చాలా ఆసక్తిగా ఉంటాడు చైతూ. మజిలి కోసం క్రికెట్ సన్నివేశాలు కోసం ఏకంగా ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నాడు.ఇక తాజాగా చై మంచి టేబుల్ టెన్నిస్ ప్లేయర్ అని కూడా ప్రూవ్ అయింది. అతడు ఏకంగా బాలీవుడ్ నట దిగ్గజాలతో కలిసే చై టేబుల్ టెన్నిస్ పోటీలకు దిగినట్లు తెలుస్తోంది. లాల్ సింగ్ చద్దా యూనిట్ సభ్యులతో కలిసి టెన్నీస్ ఆడుతోన్న కొన్ని ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో జోరుగా వైరల్ అవుతున్నాయి. ఇందులో చైతూ చాలా ఫిట్ గా కనిపిస్తున్నారు. పెద్దగా గడ్డం లేదు. మ్యాకోలా లుక్ మార్చాడు. మరి ఈ లుక్ దేని కోసమే చెప్పాల్సిన పనిలేదు.నాగచైతన్య 'లాల్ సింగ్ చద్దా' సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో చై ఆర్మీ అధికారి పాత్రలో కనిపించనున్నారు. లాల్ సింగ్ పాత్రలో మిస్టర్ పర్ పెక్ట్ నిస్ట్ అమీర్ ఖాన్ నటిస్తున్నారు. ఇంకా కిరణ్ రావ్ తదితర నటీనటులు ఈ ప్రాజెక్ట్ లో భాగస్వాములు. ఒక కీలక పాత్రలో చైతన్య నటిస్తున్నారు.ఈ మూవీ ఆన్ సెట్స్ నుంచి చై ఇలా యూనిట్ మెంబర్స్ తో టేబుల్ టెన్నీస్ ఆడి అభిమానులను సర్ ప్రైజ్ చేశారు. చైలో ఈ ప్రతిభ బయటపడటంతో అతను మల్టీ ట్యాలెంటెడ్ అంటూ ఆకాశానికి ఎత్తేస్తున్నారు. చైలో ఇన్ని కోణాలు ఎలా సాధ్యమంటూ కామెంట్లు పెడుతున్నారు. ఇక తెలుగులో చైతన్య శేఖర్ కమ్ములా దర్వకత్వంలో 'లవ్ స్టోరీ' లో నటించాడు. సినిమా రిలీజ్ కు రెడీగా ఉంది. అలాగే థాంక్యు అనే మరో చిత్రంలో కూడా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా సెట్స్ లో ఉంది.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**